Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 252 మేడ్చల్ మల్కాజ్‌గిరి 1 అక్టోబర్ 2023 ఆదివారం పేజీలు : 4

## అమృత్‌కాల్‌లో అన్ని రంగాల్లో భారత్ నెంబర్‌వన్

న్యూఢిల్లీ : ప్రధాని మోదీ నాయకత్వం, సుస్థిర పాలన వల్ల అమృత్ కాల్(2047లో స్వాతంత్ర్య దినోత్సవం నాటికి)లో భారతదేశం అన్ని రంగాల్లో అగ్రస్థానానికి చేరడం ఖాయమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఈ విషయంలో భారత్‌ను అడ్డుకునే వారే లేరని స్పష్టం చేశారు. భారతీయ కంపెనీలు ఎంఎన్‌సీలుగా ఎదిగేందుకు ఇదే తగిన సమయమన్నారు. ఈ మేరకు పీహెచ్‌డీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస (పీహెచ్ డీసీసీఐ) 118వ వార్షిక సమావేశంలో అమిత్ షా మాట్లాడారు. రాబోయే 25 ఏళ్లలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసే గ్రీన్ హైడ్రోజన్, సెమీకండక్టర్లు, ఎలక్ట్రికల్ వాహనాలు, సోలార్ ఎనర్జీ, రక్షణ, డ్రోన్లు, అంతరిక్షం, మైనింగ్ తదితర రంగాల్లో భారత్ ఇప్పటికే తన ముద్ర వేసిందన్నారు.

## ఎన్టీఆర్ శిష్యుడిగా...

# కేసీఆర్ హ్యాట్రిక్ కొడతారు



## ఖమ్మం పర్యటనలో కేటీఆర్

ఖమ్మం: కాంగ్రెస్ పార్టీపై సంచలన విమర్శలు చేశారు మంత్రి కేటీఆర్. కాంగ్రెస్ పార్టీ అంటే గ్యారంటీ కాదని, అది 420 పార్టీ అని మంత్రి కేటీఆర్ విరుచుకుపడ్డారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా కొణిజర్ల మండలం అంజనాపురం వద్ద ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీకి మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. ఈ క్రమంలో కాంగ్రెస్‌పై మండిపడ్డారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లా ప్రజలు చాలా చైతన్యవంతులని మంత్రి కేటీఆర్ అన్నారు. వారెంట్ లేని కాంగ్రెస్‌ను వచ్చే ఎన్నికల్లో అడ్రస్ లేకుండా చేయాలనని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ గెలుపు అభివృద్ధికి మలుపు కావాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి హామీలు ఇవ్వడం తప్ప నెరవేర్చడం తెలియదన్నారు. వారెంట్ లేని కాంగ్రెస్‌ను వచ్చే ఎన్నికల్లో అడ్రస్ లేకుండా చేయాలనని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ గెలుపు అభివృద్ధికి మలుపు కావాలన్నారు. ఇదే సమయంలో వైరా ఎమ్మెల్యే రాములు నాయక్‌ను మంత్రి కేటీఆర్ పొగడ్తలతో ముంచెత్తారు. బీఆర్ఎస్ పార్టీ కొన్ని కారణాల వల్ల రాములు నాయక్‌కు టికెట్ కేటాయించకపోయినప్పటికీ ఆయన పార్టీకి కట్టుబడి పని చేస్తున్నారని ప్రశంసించారు. మరోవైపు.. ఖమ్మంలోని లకారం ట్యాంక్ బండ్‌పై రూ. 1.37 కోట్లతో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ పార్క్ సహా విగ్రహాన్ని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌తో కలిసి కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసిన మహా నాయకుడు ఎన్టీఆర్. రాముడు ఎలా ఉంటాడో తెలియదు.. కృష్ణుడు ఎలా ఉంటాడో తెలియదు.. మాకు రాముడైనా, కృష్ణుడైనా ఆయనే. భారత దేశంలో తెలుగు వారంటూ ఉన్నారని గుర్తించేలా చేసింది ఎన్టీఆరే. చరిత్రలో మహనీయుల స్థానం ఎప్పటికీ చిరస్మరణీయంగా ఉంటుంది. ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించే అవకాశం రావడం నా అదృష్టం. నాకు తారక రామారావు పేరు ఉండటం చాలా సంతోషంగా ఉంది. ఎన్టీఆర్ శిష్యుడిగా కేసీఆర్ మూడో సారి హ్యాట్రిక్ కొడతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# పేరుకు “పాలేరు”.. తెలంగాణలోనే అతి పెద్ద పోరు!





ఖమ్మం : తెలంగాణలో అగ్ర నేతలు పోటీ పడుతున్న నియోజకవర్గం ఏది..? అత్యంత ఖర్చు జరిగే సీటు ఏది..? పొత్తుల్లో భాగంగా నలుగుతున్న స్థానం ఏది..? ఒకే పార్టీలో నలుగురు టికెట్ ఆశావహులు ఉన్న నియోజకవర్గం ఏది..? వీటన్నిటికీ ఒకటే నియోజకవర్గం పేరు చెప్పక తప్పదేమో..? ఉమ్మడి ఖమ్మం మిగతా తెలంగాణతో పోలిస్తే రాజకీయ, భౌగోళిక, సామాజిక పరంగా భిన్నమైనది. దీనికితగ్గట్లే అక్కడ అన్ని పార్టీలకూ ఆదరణ ఉంటుంది. బహుశా రాష్ట్రంలో మరే జిల్లాలోనూ లేని పార్టీలు ఖమ్మంలో ఉన్నాయంటే అతిశయోక్తి కాదేమో? ఉమ్మడి ఖమ్మంలో మూడే జనరల్ నియోజకవర్గాలున్నాయి. ఓసీ, బీసీ నాయకులు ప్రధాన పార్టీల నుంచి పోటీ చేయాలంటే వీటినే ఎంచుకోవాలి. కాగా, ఖమ్మం, కొత్తగూడెం పోగా కంటే ఈసారి పాలేరులో పోటీ రసవత్తరంగా మారింది. “పాలేరు” అని పేరున్నప్పటికీ పోటీ మాత్రం బహుముఖంగానే ఉండనుంది. పొంగులేటి, తుమ్మల, షర్మిల ఎన్నికల్లో పోటీకి తెలంగాణలో ఔత్సాహిక అభ్యర్థుల నుంచి కాంగ్రెస్ పార్టీ దరఖాస్తులను ఆహ్వానించిన సంగతి తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా 1,006 దరఖాస్తులు రాగా.. పాలేరు నుంచి 15 మంది దరఖాస్తు చేశారు. ఇల్లందు (38) తర్వాత ఉమ్మడి ఖమ్మంలో అత్యధిక దరఖాస్తులు వచ్చింది ఈ నియోజకవర్గం నుంచే. అయితే, ఇదంతా మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరావు కాంగ్రెస్ లో చేరకముందు. ఇక జూలైలో మాజీ ఎంపి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సైతం కాంగ్రెస్ లో చేరారు. వీరిద్దరిలో పొంగులేటి మూడు జనరల్ స్థానాలకూ దరఖాస్తు చేసుకోగా, తుమ్మల ఇటీవల కాంగ్రెస్ లో చేరడంతో దరఖాస్తుకు అవకాశం లేకపోయింది. ఇక వైఎస్సార్టీపీ అంటూ పార్టీని స్థాపించిన వైఎస్ షర్మిల పాలేరు బరిలో నిలుస్తానని హడావుడి చేసిన సంగతి తెలిసిందే. చివరకు దక్కేదెవరికో? కాంగ్రెస్ పార్టీలోనే పాలేరు టికెట్ వ్యవహారం అత్యంత సంక్లిష్టంగా మారింది. తుమ్మల పాలేరు నుంచే పోటీ చేసి తీరతానని ఖమ్మం వెళ్లే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తున్నారు. షర్మిల సైతం పాలేరు మీద పట్టు వీడడం లేదు. తన పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేసేందుకు “పాలేరు”ను ఆమె ముందు పెడుతున్నట్లుగా తెలుస్తోంది. ఒక్క కాంగ్రెస్ లోనే వీరు ముగ్గురూ టికెట్ కోసం పట్టుబడుతున్నారు. వీరే కాక మాజీ ఎంపీ రామసహాయం సురేందర్ రెడ్డి కుమారుడు, పొంగులేటి వియ్యంకుడు రఘురామిరెడ్డి కూడా పాలేరులో పోటీకి ఉత్సాహం చూపుతున్నారు. రాష్ట్ర పార్టీ అగ్ర నేత కోటాలో పాలేరు టికెట్ కు పట్టుబడుతున్నట్లు సమాచారం.

పొత్తులో పోతే..? కాంగ్రెస్ తరఫునే ఇంతమంది పోటీకి ఉండగా.. పొత్తులో భాగంగా పాలేరు సీటును కోరుతోంది సీపీఎం. సమీకరణాల్లో భాగంగా ఈ సీటు సీపీఎంకు వెళ్తే పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నగా ఉంది. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సొంత నియోజకవర్గం పాలేరు.

వామపక్షాలతో కాంగ్రెస్ కు పొత్తు గనుక కుదిరితే ఆయన ఈ సీటు నుంచి బరిలో నిలుస్తారనే నిస్సందేహం. మరి ఇన్ని సంక్లిష్టతల మధ్య ఎవరికో ఒకరికి కాంగ్రెస్ టికెట్ దక్కితే మిగతావారు గెలుపునకు సహకరిస్తారా? అనేది చూడాలి. బీఆర్ఎస్ కందాళ, బీఎస్పీ అల్లిక పాలేరులో బీఆర్ఎస్ టికెట్ సిటింగ్ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డికే దక్కింది. ఆయన గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలిచారు. అయినప్పటికీ తుమ్మలను కాదని కందాళకు టికెట్ ఇచ్చారు. దీంతోనే తుమ్మల బీఆర్ఎస్ ను వీడారు. మరోవైపు బీఎస్పీ తరఫున అల్లిక వెంకటేశ్వరరావు యాదవ్ పోటీపడుతున్నారు. ఈయన యాదవ సామాజిక వర్గానికి చెందినవారు. ఈ సామాజికవర్గం ఓట్లే పాలేరులో 65 వేల వరకు ఉన్నాయి. అంటే.. పాలేరులో అసెంబ్లీ ఎన్నికల పోరు అత్యంత రక్తికట్టనుందన్నమాట.

## డోలాయమానంలో షర్మిల పాలిటిక్స్....!

వైఎస్సార్టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రాజకీయం అనిశ్చితిలో పడింది. ఆమె తెలంగాణా రాజకీయం ఎటూ కాకుండా పోతోంది. అదే టైంలో కాంగ్రెస్ లో ఆమె పార్టీ విలీనం ప్రక్రియ కూడా నిలిచిపోయింది. ఆమె ఇపుడు ఏమి చేస్తుంది అన్నదే చర్చగా ఉంది. తెలంగాణాలో రాజకీయంగా బలపడాలని షర్మిల చూస్తున్నారు. అక్కడే తన రాజకీయ జీవితాన్ని కొనసాగించాలని కూడా చూస్తున్నారు. డిసెంబర్ లో జరిగే తెలంగాణా ఎన్నికల్లో పోటీ చేయాలని కూడా ఆమె భావిస్తున్నారు. అయితే ఆమె తెలంగాణా కాంగ్రెస్ లో చేరి రాజకీయాలు చేయడానికి టీ కాంగ్రెస్ నేతలు ఒప్పుకోవడంలేదు, ప్రత్యేకించి టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అయితే షర్మిల రాకను పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. ఆమె కనుక ఎంట్రీ ఇస్తే తెలంగాణా సెంటిమెంట్ ని బీయారెస్ రెచ్చగొడుతుందని కూడా ఆయన హై కమాండ్ కి చెబుతూ వస్తున్నారు. ఇపుడు అదే జరుగుతోంది. ఇప్పటికే బీయారెస్ మంత్రి కేటీయార్ అయితే టీ కాంగ్రెస్ నేతలు ఆంధ్రా నుంచి షర్మిల, కేవీపీ రామచంద్రరావు లాంటి వారిని అరువు తెచ్చుకుని రాజకీయాలు చేస్తున్నారు అని విమర్శలు చేశారు. ఇపుడు చూస్తే షర్మిలను తెలంగాణా కాంగ్రెస్ లో చేర్చుకుంటే నిజంగా ఆంధ్రా వారిని తెచ్చి పెడుతున్నారు అని మరింతగా బీయారెస్ కామెంట్స్ చేసే అవకాశం ఉంది అని అంటున్నారు. మరో వైపు చూస్తే షర్మిలను తెలంగాణా సహా ఏపీ ఎన్నికలలో ప్రచారం చేయించాలని కాంగ్రెస్ హై కమాండ్ భావిస్తోంది. ఆమెను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుని వైఎస్సార్టీపీని విలీనం చేయడం ద్వారా షర్మిలకు రాజ్యసభ సీటు ఇవ్వాలని చూస్తోంది అంటున్నారు. ఇక షర్మిల తెలంగాణాలో చేపట్టిన మూడు వేల ఎనిమిది వందల కిలోమీటర్ల మెగా పాదయాత్రకు అయిన ఆర్థికపరమైన మొత్తాలని ఇవ్వడానికి కూడా కాంగ్రెస్ అంగీకరించింది అని ప్రచారం సాగుతోంది. అయితే షర్మిల ఈ విషయంలో ఏ నిర్ణయం తీసుకుంటారో చూడాల్సి ఉంది అంటున్నారు. ప్రస్తుతానికి అయితే ఆమె నిర్ణయం ఏమి తీసుకోవాలా అన్న ఆలోచనలో ఉన్నారని అంటున్నారు. మరో వైపు ఆమె పార్టీకి చెందిన సీనియర్ నేతలు ఎవరి దారి వారు చూసుకుంటున్నారు. షర్మిల తన స్వార్థం కోసం కాంగ్రెస్ కి పార్టీని అప్పగించి తమకు గాలికి వదిలేశారు అన్న బాధతో ఆవేదనతో వారు ఉన్నారు అంటున్నారు. ఇంకో వైపు చూస్తే కేవలం షర్మిలకు మాత్రమే రాజ్యసభ హామీ ఇచ్చి ఆమెతో పాటు పార్టీలో ఉన్న వారికి ఎవరికీ తెలంగాణాలో టికెట్లు ఇవ్వడానికి కాంగ్రెస్ హై కమాండ్ అంగీకరించలేదని అంటున్నారు. దాంతో ఆమె వెనక ఉన్న జానపద గాయకుడు ఏపూరి సోమన్న తాజాగా బీయారెస్ లో కేటీయార్ సమక్షంలో చేరిపోయారు. అదే దారిలో మరింతమంది పట్టే అవకాశం ఉంది. ఇక షర్మిల తన పార్టీలోని లీడర్స్ ని కాపాడుకుంటూ విలీనం చేస్తేనే ఎంతో కొంత గుర్తింపు వస్తుందని అంటున్నారు. అలా కాకుండా ఆమె సింగిల్ గా వచ్చినా కాంగ్రెస్ తాను ఇస్తానన్న హామీలను నెరవేరుస్తుందా అన్న చర్చగా ఉంది. మొత్తానికి చూస్తే షర్మిల ఎటూ తేల్చుకోలేని వ్యవహారంతో తన పొలిటికల్ కెరీర్ కి భారీ మూల్యం చెల్లిస్తారా అన్న మాట కూడా వినిపిస్తోంది అంటున్నారు.



## అంతర్గత విభేదాలతో

# టీబీజేపీలో ముసలం

## రెండు వర్గాలుగా చీలిపోయాయా!?

హైదరాబాద్ : తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు రాబోతున్నాయి. ఈ నేపథ్యంలో అధికార బీఆర్ఎస్, కాంగ్రెస్ జోరు ప్రదర్శిస్తున్నాయి. కానీ బీజేపీ మాత్రం ఇక్కడ వెనుకబడుతోంది. ఇప్పటికే రేసులో మూడో స్థానంలో కొనసాగుతున్న ఆ పార్టీకి ఇప్పుడు పార్టీలో అంతర్గత విభేధాలు తలనొప్పిగా మారాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పుడు తెలంగాణలో బీజేపీ రెండు వర్గాలుగా చీలిపోయిందనే రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

తాజాగా బీజేపీలో ఓ వర్గం రహస్య సమావేశాలు నిర్వహిస్తుండటమే అందుకు నిదర్శనమని అంటున్నారు. బీజేపీలో తమకు తగిన ప్రాధాన్యత లభించడం లేదని ఓ వర్గం నేతలు అధిష్ఠానంపై అలకతో ఉన్నారని తెలిసింది. అమిత్ షా సభ సందర్భంగా కూడా తమకు తగిన గౌరవం ఇవ్వలేదని ఈ నేతలు భావిస్తున్నట్లు సమాచారం. ఈ వర్గంలో ఎక్కువగా ఇతర పార్టీల నుంచి బీజేపీలోకి వచ్చిన నాయకులే ఉన్నారు. దీంతో వీళ్లంతా కలిసి ఓ వర్గంగా మారారని టాక్. అంతే కాకుండా రహస్యంగా సమావేశాలు కూడా పెడుతున్నట్లు తెలిసింది. ఇటీవల మాజీ ఎంపీ వివేక్ ఇంట్లో మాజీ ఎంపీలు కొండా విశ్వేశ్వరరెడ్డి, విజయ శాంతి, రవీంద్ర నాయక్, మాజీ ఎమ్మెల్యేలు కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఏనుగు రవీందర్ రెడ్డి, సీనియర్ నేతలు గరికపాటి రామ్మోహన రావు తదితరులు సీక్రెట్ మీటింగ్ పెట్టుకున్నట్లు సమాచారం.

బీజేపీలో తమకు ప్రాధాన్యత దక్కడం లేదు కాబట్టి ఈ నేతలంతా కాంగ్రెస్ లోకి వెళ్లే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలిసింది. విజయశాంతి ఇప్పటికే కాంగ్రెస్ ను పొగుడుతూ.. బీజేపీని తక్కువ చేస్తూ ట్వీట్లు చేస్తున్నారు. మరోవైపు వివేక్.. ఇప్పటికే కాంగ్రెస్ అధిష్ఠానంతో చర్చలు జరిపినట్లు సమాచారం. ఈ పరిణామాలు చూస్తుంటే ఈ బీజేపీ నేతలు కాంగ్రెస్ లోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లే కనిపిస్తున్నారు. ఒకవేళ అదే జరిగితే తెలంగాణలో బీజేపీకి కోలుకోలేని దెబ్బ పడుతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

# సంపాదకీయం

## లైక్.. షేర్.. సబ్ స్క్రైబ్ ప్లీజ్.. మోదీ ది యూట్యూబర్

టిటర్ (ఎక్స్), ఫేస్ బుక్, ఇన్ స్టా గ్రామ్.. ఇప్పుడంతా సోషల్ మీడియా యుగం.. ఓ విధంగా వాట్సాప్ కూడా సోషల్ మీడియానే. చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు.. సెల్ఫీ దిగి స్టేటస్ లో పెట్టామా? స్టోరీ రాసి ఫేస్ బుక్ లో పోస్ట్ చేశామా? రీల్స్ చేసి ఇన్ స్టాలో ఉంచామా? ట్రావెల్ వీడియోనో, కుకింగ్ వీడియోనో తీసి యూట్యూబర్ అవతారం ఎత్తామా..? ఇదే ప్రధానం అయిపోతోంది.

**సంపాదన మార్గం కూడా...** మనిషిని ముఖ్యంగా యువతకు వ్యసనంగా మారి వారి జీవితాలను ఛిద్రం చేస్తుందనేది సోషల్ మీడియా గురించి ఉన్న అపవాదు. అయితే, ఇందులో కొంతనే వాస్తవం ఉంది. నాణేనికి బొమ్మ బొరుసు ఉన్నట్లు సోషల్ మీడియాకూ రెండు కోణాలు ఉన్నాయి. దీనికి ఉదాహరణే.. సోషల్ మీడియాను వేదికగా చేసుకుని కొందరు యువత సంపాదిస్తున్న తీరు. టెక్ చానెల్స్ ద్వారా, ట్రావెల్ చానెల్స్ ద్వారా వీరంతా ఆర్థికంగా ఎంతో ఎదిగారు. అటు తమ హాబీని తీర్చుకుంటూ ఇటు సంపాదన పరంగానూ ఆదర్శంగా నిలుస్తూ వస్తున్నారు.

**నాయకుల చేతిలో సోషల్ మీడియా...** ఓ పది పదిహేనేళ్ల కిందట సోషల్ మీడియా లేని రోజుల్లో ప్రధాన స్రవంతి మీడియానే నాయకులకు ఆధారం. ఇప్పుడదేమీ లేదు.. ప్రతి నాయకుడికి సొంతంగా ట్విటర్ ఖాతా ఉంది. ఇన్ స్టాలోనూ ఉన్న నాయకులున్నారు. కాగా, టెక్నాలజీ పెరిగిపోయిన ఈ రోజుల్లో అమెరికా నుంచి అమలాపురం వరకు నాయకులకు సమాచారం చేరవేయడానికి ట్విటర్ ఓ వేదికగా మారింది. కొందరు నాయకులైతే యూ ట్యూబ్ చానెళ్ల ఇంటర్వ్యూల ద్వారానే పాపులర్ అయిన సంగతి ఇక్కడ చెప్పుకోవాలి.

**మోదీ.. ది సోషల్ మీడియా మ్యాన్...**

ప్రధాని మోదీ మీద ప్రతిపక్షాలు చేసే ప్రధాన ఆరోపణ.. మీడియాను ఎదుర్కొనలేరని. గుజరాత్ సీఎంగా ఉన్నప్పటి నుంచి మీడియాకు మోదీ చాలా దూరం. గుజరాత్ అల్లర్ల సమయంలో ఇంగ్లిష్ మీడియా ఆయనకు వ్యతిరేకంగా వ్యవహరించిందనే ఆరోపణలున్నాయి. దీంతోనే ప్రధాని అయ్యాక కూడా మోదీ.. మీడియాను దగ్గరకు రానీయడం లేదు.

ఎన్నో ఏళ్ల తర్వాత.. ఆయన ఇటీవల పీటీఐకి ఇంటర్వ్యూ ఇచ్చారు. అయితే, మోదీ సోషల్ మీడియాలో చురుగ్గానే ఉంటారు. ఆయన ట్విటర్ ద్వారా చేరవేస్తుంటారు. ఇక ఇప్పుడు మోదీ యూట్యూబ్ లోకీ వచ్చారు.

**ప్లీజ్ సబ్ స్క్రైబ్ చేయండి..** సోషల్ మీడియా వచ్చాక దాదాపు ప్రతి ఒక్కరూ ఖాతా కలిగి ఉంటున్నారు. ఎక్కువ మంది యూట్యూబ్ చానెల్స్ కూడా తెరిచారు. వీరిలాగే ప్రధాని మోదీ కూడా యూ ట్యూబ్ చానెల్ ప్రారంభించారు. అంతేకాదు.. యూ ట్యూబార్ల నోటి నుంచి వచ్చే "ప్లీజ్ లైక్.. షేర్.. సబ్ స్క్రైబ్" అనే మాటలను మోదీ కూడా వాడుతున్నారు.

**15 ఏళ్లుగా యూట్యూబ్ లో ఉన్నారట...** మోదీ టెక్నాలజీని ఫాలో అవుతారా? అంటే ఔననే చెప్పాలేమో? మనందరికీ పదేళ్ల కిందట నుంచి మాత్రమే తెలిసిన యూట్యూబ్ ను ఆయన 15 ఏళ్ల కిందటి నుంచే వాడుతున్నారట. ఫ్యాన్ టెక్ ఇండియా సదస్సు ప్రారంభం సందర్భంగా ఆయనీ విషయం చెప్పారు. కాగా, తన చానెల్ ను సబ్ స్క్రైబ్ చేసుకోమని, పక్కనున్న గంట సింబల్ ను నొక్కమని కూడా కోరారు. 15 ఏళుగా యూట్యూబ్ ద్వారా దేశానికి కనెక్ట్ అవుతున్నానని చెప్పిన మోదీ.. తాను కూడా మీలాంటివాడినే అని ప్రజలనుద్దేశించి వ్యాఖ్యానించారు.

# ఇదెక్కడి సహకారం



కామారెడ్డి: పేరుకు సహకార బ్యాంకులు అయినా రైతుల పాలిట యమపాశంగా వ్యవహరిస్తుందని అపవాదు వస్తోంది. జిల్లాలో రైతులకు ఇచ్చిన పంట, దీర్ఘకాలిక రుణాల రికవరీలో ఇటీవల సహకార బ్యాంకుల అధికారులు, సిబ్బంది దూకుడుగా వ్యవహరిస్తుండడం రైతులు, రైతు సంఘాల్లో చర్చనీయాంశంగా మారింది. రుణం తీసుకునే సమయంలో రైతులు వ్యవసాయ భూమి పట్టాపాసుపుస్తకాలు అవి లేని పక్షంలో షూరిటీ కింద నగలు, భూముల మార్టిగేజ్ చేయించుకుంటున్నారు. రుణం కట్టనప్పుడు నిబంధనల ప్రకారం రైతులకు నోటీసులు ఇవ్వడం, వసూళ్లలో తాకట్టు పెట్టుకున్న వాటిని పరిగణలోకి తీసుకోవాలి. అలా కాకుండా ఇండ్లకు వెళ్లి దౌర్జన్యం చేయడంపై రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో వారిని నివాస సముదాయాల దగ్గర రైతుల పటిష్టతను భంగం కలిగించేలా వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సహకారం మాట అటుంచి ప్రైవేట్ మైక్రో ఫైనాన్స్ సంస్థల వలే కో ఆపరేటివ్ సిబ్బంది వ్యవహరిస్తున్నారని రైతులు అభిప్రాయ పడుతున్నారు.

**జిల్లాలో 29 సహకార బ్యాంకులు**

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఉండి ఎన్‌డీసీసీబీ బ్యాంకు ఉమ్మడి జిల్లాగానే ఉంది. ఈ బ్యాంక్ పరిధిలో ఇరు జిల్లాల్లో మొత్తం 92 సహకార బ్యాంకులు ఉన్నాయి. కామారెడ్డి జిల్లాలో సుమారు 2,807 మందికిపైగా రైతులు పంట రుణాలు దీర్ఘకాలిక రుణాలు, ఇతరత్రా పర్సనల్ లోన్‌లు తీసుకుని బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో మొత్తం 29 కో ఆపరేటివ్ బ్యాంకులు ఉన్నాయి. ఈ బ్యాంకుల పరిధిలో 2,807 మందికి పైగా రైతులు సుమారు 120 కోట్ల వరకు రుణాల బకాయిలు సంబంధితశాఖల అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

**వాయిదా వసూళ్లలో నిర్లక్ష్యం**

ఉమ్మడి ఎన్‌డీసీసీబీ బ్యాంక్ పరిధిలో కామారెడ్డి జిల్లాలో 29 కో ఆపరేటివ్ బ్యాంకులు ఉన్నాయి. ఈ బ్యాంకులు రైతులకు అండగా ఉండాలి. ఈ బ్యాంకుల నుంచి వ్యవసాయ రుణాలు, దీర్ఘకాలిక రుణాలతో పాటు ఇతరత్రా రుణాలు కూడా అందిసారు. ఈ రుణాల పరంగా క్షేత్రస్థాయిలో భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రధానంగా రుణం ఇచ్చిన తర్వాత నిరంతరంగా రైతులను కలిసి నెలవారి వాయిదా కట్టేలా చూడాల్సిన అధికారులు ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు. దీంతో రైతుల్లో నిర్లక్ష్యం నెలకొని అప్పు చెల్లించడం లేదు. నెలవారి కిస్తులు వసూలు చేసే రైతులపై వడ్డీ భారం పడే పరిస్థితి ఉండదు. బ్యాంకర్ల ఉదాసీనత వెనుక వడ్డీ అనే తిరకాసు దాగి ఉందనే అభిప్రాయం రైతుల్లో వ్యక్తం అవుతోంది. ఏళ్లు గడిచిన తర్వాత రుణ బకాయి వసూళ్లకు ఒత్తిడి చేయడం బ్యాంకర్ల వ్యూహంలో భాగమనే సందేహాలు రైతుల్లో, రైతు సంఘాల్లో వ్యక్తం అవుతుంది.

**రైతులకు బ్యాంకుల నుంచి నోటీసులు**

జిల్లాలోని ఆయా సహకారశాఖలో సభ్యులుగా ఉన్న రైతులకు ప్రభుత్వం ప్రతీ ఏడాది రుణాలు ఇచ్చేందుకు ఆయా ప్రైవేట్ బ్యాంకులతో పాటు ప్రభుత్వ బ్యాంకులకు లక్ష్యాలను నిర్ధేశించి బడ్జెట్‌ను కేటాయిస్తుంటారు. సహకార శాఖలో సభ్యులుగా ఉన్న రైతులు శాఖకు అనుబంధమైన సహకార బ్యాంకుల నుంచి వడ్డీలకే రుణాలు తీసుకుని పంట సాగుతో, పాడి పశువుల పెంపకానికో, వ్యవసాయ పనిముట్ల యంత్రాలకు వినియోగిస్తుంటారు. అయితే ఈ రుణాలు రైతులు తీసుకుంటూ వ్యక్తిగత ఇబ్బందుల వల్ల సకాలంలో కట్టలేక ఆ రుణాలు అలాగే ఉండిపోతున్నాయి. జిల్లాలోని సహకార బ్యాంకులో గత రెండేళ్ల నుంచి స్థానికంగా ఉండే రైతులు పంట రుణాలతో పాటు దీర్ఘకాలిక రుణాలు తీసుకుంటూ వచ్చారు. అయితే మార్చి నెలతో ఆర్థిక సంవత్సరం ముంచుకొస్తుండడంతో ఆయా బ్యాంకర్లు రైతులకు రుణాలు కట్టాలని నోటీసులు జారీ చేస్తున్నారు.

**జప్తు బాటలో బ్యాంకులు**

వ్యక్తిగత ఆస్తులు, వ్యక్తిగత పూచికత్తుతో రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించని లబ్ధిదారులపై జిల్లాలోని సహకార బ్యాంకులు దృష్టి సారించాయి. ఆర్థిక సంవత్సరం దగ్గర పడుతుండడంతో మార్చి 31లోపు ఎలాగైనా బకాయిలు రాబట్టుకునేందుకు జప్తుబాట పట్టింది. సహకార బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని ఏళ్ల తరబడి చెల్లించకుండా ఉన్న రైతులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులకు సైతం స్పందించకుంటే రుణం తీసుకున్న సమయంలో తాకట్టు పెట్టిన ఆస్తులను జప్తుచేసి వేలం వేసేందుకు బ్యాంకర్లు చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. దీంతో బకాయి పడిన రైతులు ఆందోళన చెందుతున్నారు. కొందరు వ్యవసాయ రుణాలు, మరికొందరు వాహనాలు, పాడి గేదెల కోసం వ్యవసాయేతర రుణాలను తీసుకుని ఏళ్లుగా బకాయి పడ్డారు. ఇటీవల బాన్సువాడ డివిజన్ పరిధిలోని నస్రుల్లాబాద్ మండలంలోని నస్రుల్లాబాద్, దుర్కి సహకార సంఘాల బ్యాంకుల్లో స్థానిక రైతులు వివిధ రకాల దీర్ఘకాలిక రుణాలు తీసుకున్నారు. దీర్ఘకాలిక రుణాలను సకాలంలో చెల్లించకపోవడంతో బ్యాంక్ అధికారులు రంగంలోకి దిగారు. రుణాల రికవరీ కోసం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. దుర్కి, నస్రుల్లాబాద్ సహకార బ్యాంకుల అధికారులు ప్రత్యేక వాహనాల్లో రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి రుణాలు చెల్లించాలని కోరారు. పరిస్థితులు బాగాలేవని కొంత సమయం ఇస్తే వాయిదాల ప్రకారం రుణాలను చెల్లిస్తామని బ్యాంక్ అధికారులకు రైతులు మొర పెట్టుకున్నారు. అందుకు సహకార అధికారులు ఒప్పుకోలేదు. రుణం తాలుకా డబ్బులు ఇప్పుడే చెల్లించాలని రైతుల ఇంటి ముందు కూర్చున్నారు. కట్టడానికి డబ్బులు లేవని చెప్పడంతో బ్యాంక్ అధికారులు రైతుల ఇంట్లో ఉన్న సామగ్రిని తమ వాహనాల్లో వేసుకుని వెళ్లినట్లు బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

మూడు సార్లు నోటీసులు జారీ చేశాం– రాకేష్, నస్రుల్లాబాద్ సహకార బ్యాంక్ మేనేజర్నస్రుల్లాబాద్ సహకార బ్యాంక్ పరిధిలో నస్రుల్లాబాద్, మైలారం, నాచుపల్లి, దుర్కి సహకార సంఘాలు ఉన్నాయి. ఈ సహకార సంఘాల పరిధిలోని సభ్యులుగా ఉన్న కొందరు రైతులు రూ.20 కోట్లకు పైగా రుణాలు తీసుకున్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించకపో వడంతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం మూడు పర్యాయాలుగా రుణాలు కట్టాలని నోటీసులు జారీ చేశాం. రైతులు రుణాలు కట్టి తిరిగి మళ్లీ రుణాలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. రైతులు రుణాలు కట్టి బ్యాంక్‌కు సహకరించాలన్నారు.

# ఏరియా ఆసుపత్రిలో వైద్యం మెరుగయ్యేనా?



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ఆసుపత్రిలో వైద్యం అందని ద్రాక్షగా మారింది. ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ అయినా.. ఇంకా సీహెచ్‌సీ (కమ్యూనిటీ హెల్త్ సెంటర్) ఆసుపత్రి మాదిరే సేవలు అందుతున్నాయి. ఏరియా ఆసుపత్రిలో వంద బెడ్‌లతో సేవలు అందాల్సి ఉండగా.. ఇంకా 30 పడకలతోనే కొనసాగుతోంది. ప్రభుత్వ ఆసుపత్రిలోనే చికిత్సలు చేయించుకోవాలంటూ ప్రభుత్వం ప్రచారం నిర్వహిస్తున్నా.. దానికి తగ్గట్టుగా సిబ్బందిని ఏర్పాటు చేయడంలో, నిధులను కేటాయించడంలో మీన మేషాలు లెక్కించడంతో ప్రజలకు అందాల్సిన వైద్యం ఎండమావిగానే మారింది. కేసీఆర్ కిట్, అమ్మఒడి లాంటి పథకాలు వచ్చినప్పటి నుంచి ఆసుపత్రికి గర్భిణుల తాకిడి విపరీతంగా పెరిగింది. వీరితో పాటు నిత్యం చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి సైతం వైద్యం కోసం ఆసుపత్రికి రోగులు వస్తున్న వైద్యం మాత్రం అందడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**నలుగురు వైద్యులతోనే సరి**

ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ అయిన్నప్పటికీ అందుకు తగ్గట్టుగా వైద్యులు, సిబ్బంది మాత్రం పెరగకపోవడం గమనార్హం. ఆసుపత్రిలో 14 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా ఎనిమిది మంది వైద్యులు ఉన్నారు. ఇందులో పిట్లం ఆసుపత్రిలో ముగ్గురు, ఒకరు కామారెడ్డి జిల్లా కేంద్రంకు డిప్యూటేషన్‌లో వెళ్లడంతో మరో నలుగురు మాత్రమే పనిచేస్తున్నారు. అంటే 10 మంది వైద్య పోస్టులు ఖాళీగా ఉండడంతో వైద్యం అంతంతమాత్రంగానే అందుతుంది. ముఖ్యంగా ప్రభుత్వం కేసీఆర్ కిట్, అమ్మఒడి పథకాలను ప్రవేశపెట్టిన తర్వాత గర్భిణుల తాకిడి పెరిగిపోయింది. పీహెచ్‌సీలలో ప్రసవాలు చేయకపోవడం గర్భి ణులంతా ఆసుపత్రికి రావడంతో ఆసుపత్రి అంతా కిక్కిరిసి పోతుంది. వైద్యులకు చేదోడువాదోడుగా ఉండాల్సిన నర్సుల సం ఖ్య తక్కువగా ఉండడంతో శానిటేషన్ పనుల నిమిత్తం ని యమించిన ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సేవలు వినియోగించు కుంటున్నారు. నిత్యం ఆసుపత్రిని శుభ్రంగా ఉంచడంతో పాటు అదనంగా ఆయా వార్డుల్లో వారి సేవలను వినియోగించుకోవడంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు.

**రోగులకు తప్పని తిప్పలు**

అసలే ఒంట్లో బాగలేదని ఆసుపత్రికి వస్తే డాక్టర్‌ను కలిసి తగిన చికిత్స పొందడానికి వచ్చే రోగులకు, ప్రస వం కోసం వచ్చిన మహిళలకు ప్రసవ వేదన తప్పడం లేదు. జ్వరం వచ్చిందని వచ్చిన రోగులకు సరైన వైద్యం అం దించేందుకు వైద్యులు లేకుండా పోతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. కేసీఆర్ కిట్, అమ్మఒడి నజరానా వల్ల ఆసుపత్రికి గర్భిణుల తాకిడి పెరిగింది.ఒకే ఒక గైనిక్ వైద్యురాలు ఉండడంతో గర్భిణులకు సేవలు అందడం లేదు. పురిటినొప్పులు పడుతూ ఆసుపత్రికి వస్తే కనీసం ప ట్టించుకోవడం లేదని గర్భిణుల బంధువు పేర్కొంటున్నారు. గత డిసెంబరులో ఎల్లారెడ్డి పట్టణంలోని బాలాజీనగర్ తండాకు చెందిన రాజేశ్వరి అనే మహిళ ప్రసవం కోసం ఆసుపత్రికి వచ్చింది. వైద్యురాలు, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే గర్భంలో ఉమ్మనీరు మింగి బిడ్డ చనిపోయిందని వైద్యులు తెలుపడంతో చనిపోయిన బిడ్డతో ఆసుపత్రి వద్దకు వచ్చి రాజేశ్వరి బంధువులు ఆందోళ న చేపట్టారు. అయితే, గతవారం రోజుల కిందట ఎల్లారెడ్డి మండలంలోని కళ్యాణి గ్రామానికి చెందిన అనురాధ అనే మహిళ పురిటినొప్పులు రావడంతో రాత్రి ప్రసవం నిమిత్తం ఆసుపత్రికి వచ్చింది. బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత అనురాధ తీవ్ర నొప్పి బాధపడుతూ కుటుంబ సభ్యులకు తెలపడంతో వైద్యసిబ్బందికి తెలియజేశారు. దీంతో వారు కామారెడ్డి జిల్లా కేంద్ర ఆసుపత్రికి రిఫర్ చేశారు. మార్గమాధ్యలోనే అనురాధ మృతి చెందడంతో ఎల్లారెడ్డి ఆసుపత్రిలోని వైద్యసిబ్బంది నిర్లక్ష్యం వల్లే చనిపోయిందంటూ ఆరోపించారు. పేరుకే ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తు ప్రకటన ఇచ్చారే తప్ప ఎక్కడ అందుకు అనుగుణంగా సేవలు అందక పోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. డివిజన్ కేంద్రంగా ఉన్న ఎల్లారెడ్డికి నిత్యం వందల సంఖ్యలో వైద్యసేవల కోసం ఆసుపత్రికి వస్తున్నారు.

# విమానాశ్రయ మెట్రోకు ప్రైవేటు ఆస్తుల సేకరణ

తాండూరు : విమానాశ్రయ ఎక్స్‌ప్రెస్ మెట్రోకి ప్రధానంగా రెండు ప్రాంతాల్లో భూసేకరణ చేపట్టాల్సి ఉంటుందని అధికారులు గుర్తించారు. అలైన్‌మెంట్ మార్కింగ్ పూర్తికావడంతో ఎక్కడెక్కడ ఆస్తుల సేకరణ అవసరమో నిర్ధారణకు వచ్చారు. ప్రధానంగా మలుపులు ఉన్న ప్రాంతాల్లో ప్రైవేటు ఆస్తులను సేకరించాల్సి వస్తోంది. ఖాజాగూడ, నానక్‌రాంగూడ, శంషాబాద్ ప్రాంతాల్లో మెట్రో అలైన్‌మెంట్‌లో మలుపులు ఉన్నాయి. అన్నిచోట్ల కలిపి కిలోమీటర్ మేర ఆస్తులను సేకరించాల్సి ఉంది. వీటిలో 95 శాతం ఖాళీ స్థలాలే ఉన్నాయి. మరో 5 శాతం వరకు భవనాలు ఉన్నాయి.మొత్తం 31 కి.మీ. మార్గంలో 30 కి.మీ. మేర ఆస్తుల సేకరణ సమస్యలు లేవు. ఓఆర్ఆర్, ప్రభుత్వ భూముల్లోంచి అలైన్‌మెంట్ వెళుతుంది. ఒక కిలోమీటర్ మేర మాత్రం ప్రైవేటు ఆస్తులను సేకరించాల్సి ఉంటుంది. ఖాజాగూడలో మలుపు వద్ద కొన్ని ఆస్తులు సేకరించాల్సి ఉంది. ఓఆర్ఆర్




సర్వీస్ రోడ్డు నుంచి శంషాబాద్ పట్టణంలోకి వెళ్లేచోట జాతీయ రహదారి వరకు కొన్ని ఆస్తులను సేకరించాల్సి ఉంటుందని గుర్తించారు. నాలుగు రకాలుగా ప్రయాణం.. : విమానాశ్రయ మెట్రో అలైన్‌మెంట్ నానక్‌రాంగూడ చౌరస్తా నుంచి శంషాబాద్ వరకు ఔటర్ సర్వీసు రోడ్డు పక్క నుంచి వెళుతుంది. అయితే అప్పా కూడలి వరకు తొలుత మెట్రో నిర్మించాలనుకున్న ప్రదేశంలో అత్యాధునిక సైకిల్ ట్రాక్ వస్తోంది. దీంతో ఇక్కడ సర్వీస్ రోడ్డు, సైకిల్ ట్రాక్ మధ్యన మెట్రో అలైన్‌మెంట్ వెళుతుంది. ఈమార్గంలో సర్వీసు రోడ్డును ప్రస్తుతం విస్తరిస్తున్నారు. ఈ రహదారి భవిష్యత్తులో ఒక ప్రత్యేకతను సంతరించుకోనుంది. ఒకవైపు సర్వీసురోడ్డు, తర్వాత మెట్రో, సైకిల్ ట్రాక్, ఆపై ఓఆర్ఆర్.. ఇలా నాలుగు రకాలుగా ప్రయాణం సాగనుంది.

# ఉత్తిపోతలు!

జహీరాబాద్ : అన్నదాతల గోస తీర్చేందుకు సంగమేశ్వర ఎత్తిపోతల పథకానికి ప్రభుత్వం భారీ నిధులు కేటాయించింది. సర్వేతోపాటు, భూసేకరణ పనులు చేపట్టడంతో జహీరాబాద్ ప్రాంత రైతుల్లో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకంతో నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని 1.05 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది. ఇదే సమయంలో పాత పథకాలైన కోహీర్ మండలం గొడిగార్‌పల్లి, న్యాల్‌కల్ మండలం అమీరాబాద్ ఎత్తిపోతల పథకాలను పునరుద్ధరిస్తే మరింత ప్రయోజనం చేకూరనుంది. గొడిగార్‌పల్లి పెద్ద వాగు ప్రాజెక్టు కింద 1,100 ఎకరాలకు నీటిని అందించేందుకు రూ.కోటితో 2002–03లో ఎత్తిపోతలను ఏర్పాటు చేశారు. న్యాల్‌కల్ మండలం మీదుగా సాగే మంజీర నది నిల్వ జలాల (బ్యాక్ వాటర్)తో 500 పైచీలుకు ఎకరాలకు సాగునీరు అందించేందుకు అమీరాబాద్ పథకాన్ని 2002–03లోనే రూ.56 లక్షలతో నిర్మించారు.

**పునరుద్ధరణ లేక ప్రశ్నార్థకం**

కర్ణాటక నుంచి వచ్చే వాగు నీటిని సద్వినియోగం చేసుకునేందుకు కోహీర్ మండలం గొడిగార్‌పల్లి పెద్దవాగు ప్రాజెక్ట్‌పై ఎత్తిపోతలు నిర్మించారు. సిద్ధాపూర్‌తండా, పర్శపల్లి, గొడిగార్‌పల్లితో పాటు జహీరాబాద్ మండలంలోని శేఖాపూర్, జాడీమల్కాపూర్, మల్‌చెల్మ గ్రామాల్లో 1100 ఎకరాలకు సాగు నీరు అందించేందుకు సంప్, 60 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన మూడు మోటార్లు, 60 కేవీ



ట్రాన్స్‌ఫార్మర్లు రెండు ఏర్పాటు చేశారు. పథకం పనిచేయక దొంగల పాలయ్యాయి. న్యాల్‌కల్ మండలం అమీరాబాద్ శివారులో మంజీరా మిగులు జలాలను 500 ఎకరాలకు అందించేలా ఆర్ఐడీఎఫ్–3 పథకంలో చేపట్టిన పథకం నిరుపయోగంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్, మోటార్లు చోరీకి గురయ్యాయి.

**అనుసంధానిస్తే ప్రయోజనం..**

జహీరాబాద్ నియోజకవర్గంలోని జహీరాబాద్– 20,090, ఝరాసంగం–25,800, కోహీర్–10,010, న్యాల్‌కల్–21,950 చొప్పున మండలాల్లోని ఎకరాలకు సంగమేశ్వర పథకంలో సాగునీరు అందనుంది. ఇందుకోసం ప్రభుత్వం రూ.11.42 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పథకం రూపకల్పనలో ఉన్న జల వనరుల శాఖ అధికారులు కోహీర్, న్యాల్‌కల్ మండలాల్లోని నిరుపయోగంగా ఉన్న పథకాలపై దృష్టిసారించాల్సిన తరుణమిది. ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యే మాణిక్‌రావు చొరవ చూపాలని ఆయా మండలాల రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదేశిస్తే.: విజయ్‌కుమార్, ఈఈ జల వనరుల శాఖ జహీరాబాద్ దశాబ్దాల కిందట నిర్మించిన ఈ పథకాలు ఎత్తిపోతల కార్పొరేషన్ పరిధిలో ఉన్నాయి. ప్రభుత్వం ఆయా పథకాల బదలాయింపు చేపట్టి జల వనరుల శాఖకు అప్పగించాలి. సంగమేశ్వర పథకానికి అనుసంధానించేందుకు అనువుగా ఉంటే ప్రతిపాదిస్తాం.

# పట్టాలెక్కుతున్న అభివృద్ధి!

కరీంనగర్ : ఏళ్ల తరబడి వినతులకు మోక్షం కలిగేలా కరీంనగర్, రామగుండం రైల్వే స్టేషన్లలో ప్రగతి పనులు పట్టాలెక్కబోతున్నాయి.. భారత్ అమృత్ మాల పథకంలో భాగంగా ఆదర్శంగా మారనున్నాయి.. ఈ నెల 6వ తేదీన ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేయగా ఏడాదిలో పనులు పూర్తి కానున్నాయి.

రామగుండం..దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ కాజీపేట–బల్లార్షా సెక్షన్ పరిధిలో కాజీపేట తర్వాత రెండో అతిపెద్ద రైల్వేస్టేషన్ రామగుండం. సుమారు వందకుపైగా రైళ్లు ఇక్కడ ఆగుతాయి. నిత్యం 4 వేల మందికిపైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారు. ఈ స్టేషన్ మీదుగా నిత్యం సింగరేణి, ఆర్ఎఫ్‌సీఎల్, కేశోరాం సిమెంటు కర్మాగారం ఇతర పరిశ్రమల నుంచి బొగ్గు, యూరియా, సిమెంటు, ఆహార సరకులు రవాణా అవుతాయి. రోజుకు సుమారు రూ.4 కోట్లకుపైగా ఆదాయం సమకూరుతుంది. భారత్ అమృత్ మాల కింద రూ.26.50 కోట్లతో స్టేషన్‌ను ఆధునికీకరించనున్నారు.

కల్పించనున్న సౌకర్యాలు!: స్టేషన్‌కు కుడివైపున 4 క్వార్టర్లు, కుట్టు శిక్షణ కేంద్రం భవనాన్ని కూల్చివేసి నేల చదును చేశారు. ఎడమ వైపున కార్మిక సంఘాల షెడ్లను కొంతమేర తొలగించారు. విశ్రాంతి గదుల మధ్య గోడలను కూల్చి పునర్నిర్మాణ పనులు చేపట్టారు. ప్రధాన ద్వారం ముందు టైల్స్‌ను తొలగిస్తున్నారు. ఎగువ వైపున ఒకటో ప్లాట్‌ఫాంపై పైకప్పు నిర్మాణం కోసం పనులు ప్రారంభించారు. ఒకటో ప్లాట్ఫాం నుంచి 2, 3వ ప్లాట్ఫాంల వరకు 25 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పుతో రైల్వే ట్రాక్‌ల మీదుగా అతిపెద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించనున్నారు. ఈ బ్రిడ్జికి ఇరువైపులా ఎస్కవేటర్లు, లిఫ్టులు, ర్యాంపులు ఏర్పాటు చేయనున్నారు. 1, 2, 3వ ప్లాట్ఫాంలపై ఖాళీగా ఉన్న చోట్ల ఇరువైపులా 3 షెడ్లు, ఆధునాతన మరుగుదొడ్లు నిర్మించనున్నారు. ఒకటో ప్లాట్ఫాం పాత ఫుట్ ఓవర్ బ్రిడ్జి పక్కన ప్రయాణికుల ఆహ్లాదం కోసం షెల్టర్ (పగోడా) ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుత విశ్రాంతి గదులను తొలగించి ఒకే ఒక జనరల్ విశ్రాంతి గదిని, దాని పక్కనే పెద్ద వీఐపీ లాంజ్ విశ్రాంతి గదిని ఏర్పాటు చేయనున్నారు. ప్రధానంగా రైల్వేస్టేషన్ ఎదుట పార్కింగ్ స్థలాన్ని విమా నాశ్రయం మాదిరిగా విశాలంగా మార్చనున్నారు. భవనం ముందు భాగంలో వాహనాలు ఆగేందుకు, ప్రయాణికులు దిగేందుకు, ఎక్కేందు కు వీలుగా పైకప్పు నిర్మిస్తున్నారు. స్వాగత తోరణం నుంచి ప్రధాన ద్వారం వరకు ఇరువైపులా పెద్ద రహదారులు, వాటి పక్కనే పాదచారులు నడిచేందుకు పైకప్పుతో దారులు, మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేయను న్నారు. స్థానికతకు గుర్తుగా 2 చారిత్రక చిహ్నాలను అమర్చనున్నారు. ద్విచక్ర, త్రిచక్ర, 4 చక్రాల వాహనాలకు వేర్వేరుగా పార్కింగ్ షెడ్లు నిర్మిస్తున్నారు. స్టేషన్ లోపల, బయట సి.సి. కెమెరాలు, ఎల్ఈడీ బోర్డులు, విద్యుత్తు దీపాలు, ఉద్యానవనాలు ఏర్పాటు చేయనున్నారు.

కరీంనగర్

కరీంనగర్ రైల్వే స్టేషన్‌కు సగటున రోజుకు 790 మంది ప్రయాణికులు వస్తుండగా ఏడాదికి రూ.4.96 కోట్ల ఆదాయం టికెట్ల రూపంలో సమకూరుతోంది. పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్య ఆధారంగా రైల్వే స్టేషన్‌లో వసతుల కల్పనకు ప్రాధాన్యం పెరిగింది. అయిదేళ్లలో రూ.2.92 కోట్లతో అభివృద్ధి పనులు జరగ్గా అందులో 24 కోచ్‌లు నిలబడేందుకు వీలుగా ప్లాట్‌ఫారాన్ని విస్తరించారు. రూ.99 లక్షలతో ప్రయాణికుల సామగ్రి భద్రత గదులను ఏర్పాటు చేస్తున్నారు. రూ.81.55 లక్షలతో గూడ్స్ రైలుని శుభ్రపరిచే షెడ్డు, హమాలీల కోసం అవసరమైన షెడ్డులను నిర్మిస్తున్నారు. రూ.1.60 కోట్లతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి షెడ్డు నిర్మాణం పనులు జరుగుతున్నాయి.

మరిన్ని సొబగులు : భారత్ అమృత్ మాలలో భాగంగా రూ.26.64 కోట్లతో పనులు చేపట్టనున్నారు. 12 మీటర్ల వెడల్పుతో ర్యాంపుతో కూడిన ఫుట్ ఓవర్‌బ్రిడ్జి (ఎఫ్‌వోబీ) రూ.12.55 కోట్లతో నిర్మించనున్నారు. రైల్వే స్టేషన్ ముఖద్వారంతోపాటు లోపల రూపురేఖల్ని మార్చేలా రూ.6.18 కోట్లతో వసతుల్ని ఏర్పాటు చేయనున్నారు. రూ.7.89 కోట్లతో ప్రస్తుతమున్న ప్లాట్‌ఫాంను ఆధునికీకరించ డంతోపాటు అదనంగా మరో ఫ్లాట్‌ఫాం నిర్మాణం, లిఫ్ట్ సౌకర్యం, ఎస్కలేటర్లను ఏర్పాటు చేయనున్నారు. నిరీక్షణ గదులతోపాటు స్టేషన్ లోపల మరిన్ని దుకాణ సముదాయాల్ని కొత్త డిజైన్‌తో అందుబాటులోకి తేనున్నారు. శౌచాలయాలను ప్రత్యేక నమూనాలో నిర్మించనున్నారు. ప్రయాణికులు నేరుగా తమ వాహనాలని ప్లాట్‌ఫారం చెంతకు తీసుకెళ్లే విధంగా ఏర్పాట్లు చేయనున్నారు. ముఖద్వారాన్ని ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దడం తోపాటు స్టేషన్ ఎదుట ఉద్యానవనంతోపాటు గోడలపై ఆకట్టుకునే విధంగా కరీంనగర్ ప్రత్యేకతలతో కూడిన చిత్రాలు, ప్రతిమలను ఏర్పాటు చేయనున్నారు. సమీపంలో నిర్మించనున్న ఆర్వోబీతో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పనుండగా.. ప్రయాణికులు ఇక్కడికి నేరుగా వచ్చే విధంగా నూతన మార్గాల్ని ఏర్పాటు చేయడంతోపాటు రైలు దిగిన ప్రయాణికులు పట్టాలకు ఇరువైపులా ఉన్న మార్గాల ద్వారా సులువుగా ఇళ్లకు వెళ్లేలా ప్రణాళికల్ని సిద్ధం చేశారు.

# లక్షణంగా..గృహలక్ష్మి ..!

నల్గొండ: గృహలక్ష్మి పథకానికి ఉమ్మడి జిల్లాలో వివిధ స్థాయిల్లో జరిగిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియలో లక్షకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు తెలిసింది. మూడు రోజుల్లో సాగిన ఈ క్రతువులో ప్రజల నుంచి భారీగా స్పందన వచ్చింది దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ ప్రారంభం కానుంది. యాదాద్రి జిల్లాలో చివరిరోజైన గురువారం ఒక్కరోజే 23 వేలకు పైగా దరఖాస్తులు రావడం గమనార్హం. మొత్తంగా యాదాద్రిలో మూడు రోజుల్లో 34,147 దరఖాస్తులు వచ్చాయి. సూర్యాపేట జిల్లాలో 18,820 దరఖాస్తులు రాగా.. నల్గొండ జిల్లాలో సాయంత్రం వరకు 50 వేల వరకు దరఖాస్తులు వచ్చినట్లు.. మొత్తంగా ఈ సంఖ్య 70 వేల వరకు ఉండే అవకాశం ఉంటుందని గృహనిర్మాణ శాఖ అధికారులు 'ఈనాడు'కు వెల్లడించారు. చివరి రోజు ఒక్కరోజే 35 వేల వరకు దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. తొలి దశలో నియోజకవర్గానికి 3 వేల చొప్పున పన్నెండు నియోజకవర్గాలకు 36 వేల వరకు లబ్ధిదారుల ఎంపిక జరగనుండగా..అందుకు మూడు రెట్లు ఎక్కువగా దరఖాస్తులు రావడం గమనార్హం.

వారం రోజుల్లో తుది జాబితా

నేటి నుంచి క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులు దరఖాస్తులను పరిశీలించనున్నారు. ఎక్కువగా స్థానిక ప్రజాప్రతినిధుల సిఫార్సులతోనే దరఖాస్తులు రావడంతో ఈ క్రతువులో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకంగా మారింది. యుద్ధ ప్రాతిపదికన పరిశీలన పూర్తి కావాలని ఇప్పటికే ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలోని అధికారులు, సిబ్బందిని ఆదేశించ డంతో.. వారం రోజుల్లోగా తుది జాబితాను తయారు చేయాలని యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఈ నెల 20లోగానే నియోజకవర్గాల వారీగా తుది జాబితాను తయారు చేసి ఆయా ముఖ్య ప్రజాప్రతినిధుల సూచనతో లబ్ధిదారుల ఎంపిక జరగనుందని తెలిసింది. తుది జాబితాను ఈ నెల 25న వెల్లడించనున్నారు.

# ధాన్యం ఉందా.. ధనమై పోయిందా..!



హుజూర్‌నగర్ : సీఎంఆర్ బియ్యం అప్పగించేందుకు మరో నాలుగు రోజులే గడువు.. కానీ రెండు సీజన్‌ల లక్ష్యాలు మిల్లర్ల వద్దనే పేరుకుపోవటంతో గడువు లోపు సీఎంఆర్ బియ్యం పెట్టడం అసాధ్యంగా మారింది. ఇక అధికారులకు గడువు పెంచటం మినహా మరో మార్గం లేదు. వానాకాలం, యాసంగి సీజన్‌లకు సంబంధించి మిల్లులకు కేటాయించిన ధాన్యం మేరకు ఈ నెల 30 వరకు పూర్తి స్థాయిలో సీఎంఆర్ బియ్యం పెట్టాల్సి ఉంది. కాని ఉమ్మడి జిల్లాలో రెండు సీజన్‌ల లక్ష్యాలు పూర్తి కాలేదు. అసలు మిల్లర్లు ఎందుకు సీఎంఆర్ బియ్యం పెట్టడం లేదు అన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. తీసుకున్న ధాన్యం మిల్లర్ల వద్ద ఉంటే ఇప్పటికే లక్ష్యాలు పూర్తి అయ్యేవని, కొందరు మిల్లర్లు ధాన్యాన్ని పక్కదారి పట్టించటం వల్ల సీఎంఆర్ లక్ష్యాలు పూర్తవటం లేదని బహిరంగంగానే చెప్పుకుంటున్నారు.

యాసంగిలో.. అందరిదీ అదే పరిస్థితి గతంలో ఉమ్మడి జిల్లాలో ఎప్పుడు మెరుగ్గా ఉండే నల్గొండ, యాదాద్రి జిల్లాల మిల్లర్లు వానాకాలంతో పాటు, యాసంగి సీఎంఆర్ బియ్యం పెట్టేందుకు ముందుకు రాలేదు. దీనికి ప్రధాన కారణం పక్క జిల్లాల వారు పెట్టకున్నా అడగకపోవడమే. యాసంగి లక్ష్యంలో నల్గొండ ఈ నెల 25 నాటికి 17 శాతం పూర్తి చేయగా, యాదాద్రి 18 శాతం పూర్తి చేసింది. ఇక సూర్యాపేట తనదైన శైలిలో 02 శాతం లక్ష్యాలను పూర్తి చేసింది. సీఎంఆర్ ధాన్యం తీసుకున్న మిల్లర్లు మరో సీజన్ ధాన్యం వచ్చే సమయానికి అంతకు ముందు సీజన్ సీఎంఆర్ బియ్యం సేకరణలు పూర్తి చేయాలి. కాని జిల్లాలో అందుకు భిన్నంగా జరుగుతుంది. ప్రస్తుతం యాసంగి సీజన్ వచ్చింది. యాసంగి సీఎంఆర్ ధాన్యం కూడా మిల్లులకు కేటాయించటం అయింది. కాని వానాకాలం లక్ష్యాన్ని మాత్రం పూర్తి చేయలేదు.

మిల్లులో ధాన్యం లేదన్న వాదనలే ఎక్కువ

సీఎంఆర్ ధాన్యం తీసుకున్న మిల్లర్లు వారికి నిర్దేశించిన లెక్క ప్రకారం వెంటనే మర ఆడించి బియ్యం పౌర సరఫరాల శాఖకు, ఎఫ్‌సీఐకి అప్పగించాలి. కానీ మిల్లర్లు తీసుకున్న ధాన్యాన్ని తమ వ్యాపార అభివృద్ధి కోసం అమ్ముకోవటం వల్లనే మిల్లర్లు సీఎంఆర్ బియ్యం పెట్టడం లేదనేది ఆయా వర్గాలలోనే గుసగుస. ధాన్యం నిల్వలు ఉన్నాయా లేవా అన్నదానిపై గతంలో అధికారులు తనిఖీలు కూడా చేశారు. కాని ఆ తనిఖీలలో తమ ధాన్యం లెక్కించే పద్ధతిలో లేవని కొందరు, ఇంకా రకరకాల కారణాలతో లెక్కలు చూపించలేదు. చూపించిన వారు కూడా కాకి లెక్కలు చూపి అధికారులకు ముడుపులు చెల్లించారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. సూర్యాపేట జిల్లాలో గడప దాటుతున్న సీఎంఆర్ ధాన్యాన్ని పట్టుకున్న ఘటనలు కూడా ఉన్నాయి. అవి సీఎంఆర్ ధాన్యమే అని అధికారులు నిగ్గు తేల్చారు. కాని జరిగింది ఏమి లేదు. రాజకీయ జోక్యం వల్ల పరిస్థితి మామూలుగానే మారింది. సూర్యాపేట జిల్లాలో సీఎంఆర్ బియ్యం సేకరణల కోసం బకాయి ఉన్న మిల్లులకు ప్రత్యేక అధికారులను కేటాయించినా పెద్దగా ప్రయోజనం లేకుండా పోయిందనేది జరిగిన సేకరణలను బట్టి తెలుస్తుంది. ఈ సారి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా..గతంలో నల్గొండ, యాదాద్రి జిల్లాలు సీఎంఆర్ ధాన్యం పెట్టటంలో ముందుండేవి. ఒక దశలో రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా నల్గొండ జిల్లా ఉన్న రోజులు కూడా ఉన్నాయి. ప్రస్తుతం పక్క జిల్లా వారిని చూసి మారారో, లేక అధికారులు ఒత్తిడి లేదో కాని వానాకాలం సీజన్ లక్ష్యంలో నల్గొండ జిల్లా ఈ నెల 25 నాటికి కేవలం 73 శాతం పూర్తి చేసింది. యాదాద్రి జిల్లా 58 శాతం మాత్రమే లక్ష్యాలను పూర్తి చేసింది. ఇక సూర్యాపేట జిల్లా ఎప్పటి మాదిరిగానే వానాకాలం సీజన్‌కు సంబంధించి ఇప్పటి వరకు కేవలం 37 శాతం మాత్రమే పూర్తి చేసింది.

# చండూరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు



చండూరు : చండూరు కేంద్రంగా.. మునుగోడు, గట్టుప్పల, నాంపల్లి, మర్రిగూడ మండలాలతో కలిసి రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను విడుదల చేసింది. తెలంగాణ జిల్లాల ఏర్పాటు చట్టం ప్రకారం పరిపాలనా సౌలభ్యం, ప్రాంతాభివృద్ధి కోసం డివిజన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్టు ఉత్తర్వులో రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి నవీన్ మిత్తల్ పేర్కొన్నారు. డివిజన్ ఏర్పాటు పై ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల ప్రజల అభిప్రాయాలను సేకరించేం దుకు పదిహేను రోజుల గడువునిస్తూ ఈనెల 4న నోటిఫికేష న్‌ను విడుదల చేశారు. నోటిఫికేషన్‌లో ప్రకటించిన 15 రోజుల గడువు ముగిశాక అభిప్రాయాల పరిశీలన అనంతరం చండూరును డివిజన్‌గా ఏర్పాటు చేస్తున్నట్టు తుది ఉత్తర్వులను విడుదల చేయడంతో చండూరు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి కేటీఆర్ చేతులమీదుగా డివిజన్‌ను ప్రారంభించనున్నట్టు సమాచారం. ఇప్పటి వరకు చండూరు, మునుగోడు, గట్టుప్పల మండలాలు నల్గొండ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉండేవి. మర్రిగూడ, నాంపల్లి మండలాలు దేవరకొండ డివిజన్ పరిధిలో కొనసాగాయి. డివిజన్ స్థాయి కార్యాలయాలు ఈ రెండు డివిజన్ కేంద్రాల్లో నిర్వహించేవారు. ప్రజలు తమ ఇబ్బందులను తొలగించేందుకు చండూరును డివిజన్‌గా ఏర్పాటు చేయాలని ఎంతో కాలంగా ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గత నవంబరులో నియోజక వర్గంలో జరిగిన ఉప ఎన్నిక సందర్భంగా ఇది ప్రధాన డిమాండ్‌గా ముందుకొచ్చింది. అక్టోబరు 30న బంగారుగడ్డలో నిర్వహించిన బహిరంగసభలో ముఖ్యమంత్రి కేసీఆర్ చండూరు డివిజన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి అమలు చేశారు. 975 చ.కి.మీ. వైశాల్యంతో అయిదు మండలాలతో విస్తరించిన ఈ డివిజన్ కేంద్రంలో రాజస్వమండలాధికారి (ఆర్డీవో) కార్యాలయం ప్రారంభించడానికి భవనాన్ని ముస్తాబు చేస్తున్నారు. 1,72,968 జనాభాకు సేవలందించే పోలీస్, పంచాయత్‌రాజ్, నీటి పారుదల, వ్యవసాయ, విద్య, పంచాయతీ, ఎక్సైజ్, విద్యుత్తు, రోడ్లు–భవనాలు తదితర శాఖల డివిజన్ కార్యాలయాలు సైతం ఇక్కడ ప్రారంభించే అవకాశముంది. చండూరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కావాలనే ప్రజల ఆకాంక్ష నెరవేరిందని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నూతన మండలంగా అమ్మనబోలుప్రజలకు మెరుగైన పాలన, సత్వర అభివృద్ధి కోసం నల్గొండ జిల్లాలోని అమ్మనబోలు గ్రామాన్ని కొత్త రెవెన్యూ మండలంగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ప్రాథమికంగా ఉత్తర్వులు జారీ చేసిందని రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిత్తల్ ఓ ప్రకటనలో తెలిపారు. నార్కట్‌పల్లి మండలంలోని పల్లెపహాడ్, బెండల్‌పహాడ్, రామన్నపేట మండలంలోని కుంకుడుపాముల, తుర్కపల్లి, సూరారం, శాలిగౌరారం మండలంలోని ఉప్పలంచ, రామంజపురం గ్రామాలను కలిపి అమ్మనబోలు మండలంగా ఏర్పాటు చేశారన్నారు. అభ్యంతరాలు ఉంటే 15 రోజుల్లో లిఖితపూర్వకంగా తెలియాజేయాలని పేర్కొన్నారు.

# వైరాజీకీయం..!

వైరా : వైరా నియోజకవర్గ భారాసలో నివురుగప్పిన నిప్పులా ఉన్న ముఖ్యనేతల మధ్య రాజీ ప్రయత్నాలు జరిగాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే రాములునాయక్, భారాస అభ్యర్థి బాణోత్ మదన్‌లాల్ తొలుత సామరస్యంగా మెలిగినా కొద్దిరోజుల తరువాత వారి మధ్య పొరపచ్చాలొచ్చాయి. దళితబంధు పథకం లబ్ధిదారుల ఎంపికలో తన అధికారాలను ఇతరులకు ఎలా కట్టబెడతారని, వైరా నియోజకవర్గంలో పెత్తనమేంటని మంత్రి పువ్వాడ అజయ్‌పై ఎమ్మెల్యే రాములునాయక్ ఘాటుగా వ్యాఖ్యానించిన విషయం విదితమే. అప్పటి నుంచి ఎమ్మెల్యే రాములునాయక్, భారాస అభ్యర్థి మదన్‌లాల్ ఎవరి దారి వారిదే అన్నట్లు వ్యవహరిస్తున్నారు.

మంత్రి, ఎంపీ సమక్షంలో చర్చలు

ఖమ్మంలో ఎంపీ నామా నాగేశ్వరరావు ఇంట్లో మంత్రి అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ తాతా మధు సమక్షంలో ఎమ్మెల్యే రాములునాయక్, భారాస అభ్యర్థి మదన్‌లాల్ సమావేశమయ్యారు. వైరా నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలపై చర్చించారు. ప్రొటోకాల్ పరంగా ఎమ్మెల్యేకు, భారాస అభ్యర్థికి పార్టీలో సమ ప్రాధాన్యముంటుందని, ఇద్దరూ కలిసి పనిచేయాల్సిందేనని మంత్రి, ఎంపీ విస్పష్టంగా చెప్పినట్లు సమాచారం. పార్టీ అభ్యర్థి విజయానికి ఎమ్మెల్యే కృషిచేయాలని, అదే సమయంలో అభ్యర్థి కూడా అందరినీ కలుపుకొని ముందుకు సాగాలని చెప్పినట్లు తెలిసింది. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో సంయుక్తంగా సమావేశాలు నిర్వహించి ఐక్యతారాగం వినిపించాలని చెప్పినట్లు సమాచారం. ప్రతి మండలస్థాయి సమావేశానికి పార్టీ పర్యవేక్షకుడిగా ఎంపీ నామా నాగేశ్వరరావు హాజరుకానున్నారు. నియోజకవర్గస్థాయి సమావేశానికి మంత్రి అజయ్, ఎంపీ నామా తదితరులు రానున్నారు. ఖమ్మంలో మంత్రి అజయ్‌ను ఎమ్మెల్యే రాములునాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు.

బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలని వినతి

స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల బదిలీల సీనియారిటీ జాబితాలో అనేక తప్పులు దొర్లాయని, వాటన్నింటినీ సరిచేయాలని కోరుతూ యూటీఎఫ్ జిల్లా నాయకులు డీఈఓ సోమశేఖరశర్మకు ఖమ్మంలో వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయులు పెట్టుకున్న అప్పీళ్లన్నీ సమగ్రంగా పరిశీలించి కచ్చితమైన జాబితాను విడుదల చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి సురేశ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంకు వచ్చేనా!

గోదావరిఖని : స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలో గత ఏడాది ఆశించిన ర్యాంకు రాకపోగా అంతకు ముందుకంటే దిగజారిపోయింది. ఈ సారి సైతం నగరంలో స్వచ్ఛత నిర్వహణను నగరపాలిక అంతగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. 2021లో కేవలం ఒక్క పారిశుద్ధ్య పర్యవేక్షకుడితో పాటు కొద్దిమంది సహాయ పర్యవేక్షకులున్నప్పటికీ జాతీయ స్థాయిలో 92వ ర్యాంకు సాధించింది. గత ఏడాది ముగ్గురు పారిశుద్ధ్య పర్యవేక్షకులకు తోడుగా సహాయ పర్యవేక్షకుల సంఖ్య సైతం దాదాపుగా రెట్టింపైంది. అయినా స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకు మాత్రం 136కి పడిపోయింది. ఈ సారి సైతం సంపూర్ణ పారిశుద్ధ్య నిర్వహణపై బల్దియా అంతగా దృష్టి సారించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కీలకమైన తడి, పొడి చెత్త సేకరణ, చెత్త, మురుగు నిర్వహణ రామగుండంలో నామమాత్రంగా సాగుతోంది. చెత్త నిర్వహణలో కీలకమైన డంపింగ్ యార్డునకు స్థలం లేకపోగా గోదావరినది ఒడ్డున నగరంలోని చెత్తను వేస్తున్నారు.

ప్రజాభిప్రాయమే కీలకం

స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల కేటాయింపులో ప్రజాభిప్రాయ సేకరణే కీలకమైనప్పటికీ రామగుండం నగరపాలిక ఇందులో వెనకంజలోనే ఉంది. ప్రజాభిప్రాయ సేకరణ మొదలైన చాలా రోజుల వరకు సర్వర్లు సరిగా పనిచేయకపోవడం, లొకేషన్ చూపించకపోవడం తదితర కారణాలతో ప్రజాభిప్రాయ సేకరణ నామమాత్రంగానే జరిగింది. ఆ తర్వాత నుంచి నగరపాలికలోని వివిధ విభాగాల అధికారులు దీనిపైనే దృష్టి సారించినా ప్రయోజనం లేకపోగా గత వారం రోజులుగా ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుంటుండటంతో కొంత మేరకు పెరుగుతున్నాయి. జనాభాలో 50 నుంచి 60 శాతం వరకు ప్రజాభిప్రాయ సేకరణ జరగాలని ఉన్నతాధికారులు చెబుతున్నారు. రామగుండంలో 2.3 లక్షల జనాభా ఉండగా అందులో రూ. 1.15 లక్షలకు పైగా ప్రజాభిప్రాయ సేకరణ జరగాల్సి ఉంది. నగరపాలికలో గురువారం నాటికి కేవలం 9,660 మంది అభిప్రాయాలు మాత్రమే నమోదయ్యాయి. కరీంనగర్ నగరపాలికలో 22,933, పెద్దపల్లి మున్సిపాలిటీ కేవలం 293 నమోదయ్యాయి.

చెత్త నిర్వహణపై ప్రత్యేక దృష్టి

దేశవ్యాప్తంగా నగరాలు, పట్టణాల్లో సంపూర్ణ పారిశుద్ధ్య నిర్వహణే లక్ష్యంగా కేంద్రం 2016 నుంచి స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా మరో వారం రోజుల్లో క్వాలిటీ కౌన్సిల్ ప్రతినిధులు రామగుండంలో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టనున్నారు. ఇప్పటికే రామగుండంలో పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించిన దస్త్రాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయగా క్షేత్రస్థాయి పరిస్థితులను ప్రతినిధులు పరిశీలించి మార్కులు కేటాయిస్తారు. ఈ మార్కులు ర్యాంకుల ప్రకటనలో కీలకం కానున్నాయి. ప్రధానంగా ఆయా నగరాల్లో చెత్త, మురుగు నిర్వహణను మెరుగు పరిచేందుకు మార్కులు కేటాయించారు. ఇంటింటా తడి, పొడి చెత్త సేకరణ తప్పనిసరి. నగరంలోని మురుగునీటినంతా శుద్ధి చేశాకే బయటకు వదలడం, తడిచెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారీ, పొడి చెత్తను పునర్వినియోగానికి తరలించడం ఇందులో కీలకమైనవి. ఇందులో తడి, పొడి చెత్త సేకరణ రామగుండంలో అటకెక్కగా ఇంటింటా చెత్త సేకరణ మాత్రం జరుగుతోంది. మురుగునీటి శుద్ధికోసం రెండు సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు నిర్మించాల్సి ఉండగా రామగుండంలో ఒక్కటి పూర్తయింది. దీనిని ఇంకా వినియోగంలోకి తీసుకురాలేదు. అత్యధికంగా మురుగు వెలువడే గోదావరిఖనిలో దాని ఊసే లేదు. మరుగుదొడ్డి వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని నిర్మించినా వినియోగించడం లేదు. తడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారీ నామమాత్రంగా సాగుతోంది. కొందరు స్వశక్తి మహిళలు సొంత ఆసక్తితో సేంద్రియ ఎరువు తయారీ చేసి కిచెన్ గార్డెన్‌కు వాడుతున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను మాత్రం గుత్తేదారు ద్వారా పునర్వినియోగానికి తరలిస్తున్నారు. తడి చెత్త నిర్వహణ కోసమంటూ రూ.కోటికి పైగా వెచ్చించి యంత్రాలు కొనుగోలు చేసి, షెడ్లు నిర్మాణం చేసినా ఆచరణకు నోచుకోవడం లేదు. నిషేధిత ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టలేకపోతున్నారు. సామాజిక మరుగుదొడ్లను మాత్రం అభివృద్ధి చేశారు. ఆయా అంశాలపై నగరపాలిక పూర్తిస్థాయి దృష్టి సారించాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# మూడు నెలలైనా.. పుస్తకాలు రాలే..!

మిర్యాలగూడ : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణతా శాతం గత కొన్నేళ్లుగా భారీగా తగ్గుతూ వస్తోంది. ప్రైవేట్ సంస్థల నుంచి వచ్చే పోటీని తట్టుకుని నిలబడి..విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్నప్పటికీ అవి క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 31 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో తరగతులు ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నప్పటికీ.. పుస్తకాలు పంపిణీ చేయలేదు. దీంతో పేద విద్యార్థులు ఎన్నో అవస్థలు పడుతున్నారు. అధ్యాపకులు పాత పుస్తకాలతో తరగతులు బోధిస్తున్నప్పటికీ.. వాటిని ఇంటిదగ్గర చదువుకోలేక విద్యార్థులు వెనకబడిపోతున్నారు.బయట కొనలేక అవస్థలు..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 31 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 14,500 మంది మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉన్నారు. అన్ని పట్టణాలు, మండల కేంద్రాల్లోనూ ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ప్రభుత్వ కళాశాలల్లో కేవలం పేదలు మాత్రమే చేరుతున్నారు. అయితే నేటి వరకు పుస్తకాలు పంపిణీ చేయకపోవడంతో.. సుమారు రూ.2,500 వెచ్చించి బయట కొనలేక అనేక మంది పేద విద్యార్థులు చదువులో వెనుకబడి పోతున్నారు. ఈ పాటికి 35 శాతం సిలబస్ అయిపోతున్నప్పటికీ పుస్తకాల పంపిణీలో జాప్యం చేయడం సరికాదని విద్యార్థులు వాపోతున్నారు.

గురుకులాలు, కస్తూర్బాల్లో ఇదే పరిస్థితి..

ఉమ్మడి జిల్లాలో మొత్తం బీసీ గురుకుల జూనియర్ కళాశాలు 26 ఉండగా..3,520 మంది విద్యార్థులు ఉన్నారు. ఎస్టీ గురుకుల కళాశాలలు 12 ఉండగా..7,460 మంది విద్యార్థులు ఉన్నారు. నల్గొండ ఆర్సీవో పరిధిలో 19 ఎస్సీ గురుకులాలు ఉండగా..3,040 మంది విద్యార్థులు ఉన్నారు. యాదాద్రి జిల్లా పరిధిలో 31 కస్తూర్బా గాంధీ, ఆదర్శ, ఎస్సీ గురుకుల కళాశాలలు ఉండగా.. మొత్తం 3,720 మంది విద్యార్థులు ఉన్నారు. నల్గొండ జిల్లాలో 14 కస్తూర్బాగాంధీ కళాశాలల్లో 1,600 మంది విద్యార్థినులు ఉన్నారు. వీరికి సైతం పుస్తకాలు జాప్యం జరుగుతుండడంతో అనేక అవస్థలు పడుతున్నారు.

అధ్యాపకులు లేక అవస్థలు..

మరో వైపు పలు కస్తూర్బాగాంధీ, ఆదర్శ, ఎస్టీ, ఎస్సీ, బీసీ గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా ఈ విద్యా సంవత్సరం నుంచి ఉన్నతీకరించారు. అయితే ఆయా కళాశాలల్లో అధిక మంది ఒప్పంద అధ్యాపకులే ఉండడం.. వారంతా వివిధ పోటీ పరీక్షల నేపథ్యంలో కళాశాలలకు రాకపోవడంతో విద్యార్థులకు పాఠాలు బోధించేవారు కరవయ్యారు. దీంతో విద్యార్థులు నిత్యం కళాశాలలకు వచ్చి..వారికి వారే చదువుకుని వెళ్తున్నారు.

# ఆకట్టుకునే బోధన.. అబాకస్ శిక్షణ

కోరుట్ల: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడంతో పాటు గణితంలో రాణించేందుకు ఓ ఉపాధ్యాయుడు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గణితంలో బలమైన పునాది వేసి విద్యార్థుల భవితకు బంగారు బాటలు వేయాలనే లక్ష్యంతో స్వయంగా అబాకస్‌లో శిక్షణ పొంది తాను పని చేసే సర్కారు బడిలో విద్యార్థులకు నిత్యం నేర్పిస్తూ వారితో క్రమంగా సాధన చేయిస్తున్నాడు. విద్యార్థులు నేర్చుకున్న అబాకస్‌ను ప్రదర్శించి ప్రపంచ రికార్డులను సాధించేలా చేయడంతో ఆ సర్కారు బడికి అంతర్జాతీయ స్థాయిలో అవార్డులను సాధించి పెట్టాడు. రాష్ట్రవ్యాప్తంగా 36 ప్రభుత్వ పాఠశాలల విజయగాథలతో ఎస్.సి.ఇ.ఆర్.టి.(స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్) ఆధ్వర్యంలో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి 'ఇంపాక్ట్ ఇన్‌ఫ్లుయెన్స్ ఇన్‌స్పిరేషన్' పుస్తకాన్ని ఇటీవల విడుదల చేసింది. ఇందులో కోరుట్ల పట్టణం అంబేద్కర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అడ్డగట్ల గంగాధర్




విద్యార్థులకు నేర్పిన 'అబాకస్ ఆన్ ఫింగర్స్ పేపర్‌లెస్ ప్రామిస్' అనే అంశం మొదటిదిగా ప్రచురితం కావడం విశేషం.

**శిక్షణతో ప్రత్యేక గుర్తింపు..**

కోరుట్ల పట్టణం అంబేద్కర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అడ్డగట్ల గంగాధర్ ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. పాఠశాలలో ప్రస్తుతం 130 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. గంగాధర్ విద్యార్థులకు విద్యాబోధన చేయడంతోపాటు వారిని మరింతగా ఆకర్షితులను చేసేందుకు 2006లో గణితంపై పట్టు సాధించేందుకు పూసల చట్రం(అబాకస్)లో హైదరాబాద్‌లో స్వయంగా శిక్షణ పొందాడు. తాను పని చేసే ప్రతి పాఠశాలలో విద్యార్థులకు అబాకస్‌లో శిక్షణ ఇస్తున్నాడు. గంగాధర్ వినూత్నంగా పూసల చట్రం ద్వారా కాకుండా చేతి వేళ్ల లెక్కిస్తూ వాటి ద్వారా కూడికలు, తీసివేతలు, గుణించడం, ఎక్కాలు విద్యార్థులకు నేర్పించాడు. విద్యార్థులు ఎడమ చేతి, కుడి చేతి వేళ్లను ఉపయోగించవచ్చు. కుడి చేతి వేళ్లు 0, 1, 2, ...9గా లెక్కించడానికి, అదే సమయంలో ఎడమ చేతి వేళ్లు 10, 20, 30 ...90 ఇలా లెక్కిస్తారు. 1వ తరగతి విద్యార్థుల్లో సంఖ్య భావనను అభివృద్ధి చేసేందుకు అబాకస్‌ను ఉపయోగిస్తాడు. 0 నుంచి 100 సంఖ్యలను గుర్తించడం, 0-100 సంఖ్యలను చదవడం, 0-100 సంఖ్యలను రాయడం నేర్పిస్తాడు. 770 సెకన్లలో 100 ఎక్కాలు విద్యార్థులతో చెప్పించి ప్రపంచ రికార్డు సాధించాడు. 60 నిమిషాల వ్యవధిలో 4,250 సమస్యలను స్టెరింగ్ చేస్తూ పరిష్కరించి రికార్డు సృష్టించాడు. 1వ తరగతికి చెందిన ఇద్దరు విద్యార్థులు కళ్లకు గంతలు కట్టుకుని నిమిషంలో 30 సమస్యలను పరిష్కరించడంతో యూకేలోని డి జీనియస్ బుక్ ఆఫ్ రికార్డును సాధించాడు. ఇండియా ప్రైడ్ అవార్డు, జాతీయ స్థాయిలో ఐ టాప్ బెస్ట్ టీచర్ అవార్డు, స్టేట్ బుక్ ఆఫ్ అవార్డులను దక్కించుకున్నారు. గతేడాది ప్రభుత్వం రూపొందించిన 'రైస్ అండ్ షైన్' బుక్‌లోనూ గంగాధర్ ఇస్తున్న అబాకస్ శిక్షణపై ప్రత్యేక కథనాన్ని ముద్రించారు.

**గణితంపై పట్టు, చురుకుదనం**

1వ తరగతి నుంచి విద్యార్థులకు అబాకస్‌లో శిక్షణ ఇవ్వడంతో గణితంపై పూర్తిస్థాయిలో పట్టు సాధిస్తారు. నిత్యం అబాకస్‌లో సాధన చేయడంతో చతుర్విధ ప్రక్రియలో సులభంగా నేర్చుకుంటారు. విద్యార్థుల్లో ఉత్సాహం, చురుకుదనం, జ్ఞాపకశక్తి, గ్రహించే శక్తి పెంపొందుతుంది. క్యాలిక్యులేటర్ సాయం లేకుండానే చేతి వేళ్ల ద్వారా గణిత సమస్యలను పూర్తి చేస్తుంటారు. గణితంలో రాణించేందుకు అబాకస్ ఎంతగానో ఉపయోగపడుతుంది. అడ్డగట్ల గంగాధర్, ప్రధానోపాధ్యాయుడు

# ఖాళీ స్థలాలు.. అపరిశుభ్రతకు నిలయాలు

కరీంనగర్: 'ఖాళీ ప్లాట్లలో చెత్తా చెదారం, మురికి నీరు నిల్వ ఉండి ప్రజారోగ్యానికి నష్టం కలిగించినట్లయితే వ్యాధుల చట్టం 1897, తెలంగాణ మున్సిపాలిటీల చట్టం 2019 సెక్షన్ 161(1) ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.' అయినా ఉమ్మడి జిల్లాలో కరీంనగర్, రామగుండం నగరపాలక సంస్థలతోపాటు పలు మున్సిపాలిటీల్లో ఖాళీ స్థలాల్లో నీరు నిండినా పట్టించుకునేవారే లేరు. ఎండాకాలంలో చెత్తాచెదారం నిండి ఉంటుండగా.. వర్షాకాలంలో ఆ స్థలాలు కుంటలను తలపిస్తున్నాయి. నిల్వ నీరు బయటకు వెళ్లే దారి లేకపోవడం, అందులోనే నిరంతరం ఉండటం, పిచ్చి మొక్కలు, తుమ్మ చెట్లు, చెత్తా చెదారంతో నిండి దుర్గంధం వెదజల్లుతోంది. పైగా ఈ ఖాళీ స్థలాలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారి ఇబ్బంది పెడుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని 14 మున్సిపాలిటీలు, రెండు నగరపాలక పరిధిలో సుమారు 1,10,684 ఖాళీ ప్లాట్ల ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అందులో నీరు నిలిచి, అపరిశుభ్రతకు నిలయంగా ఉన్నవి 50వేలకు పైగానే ఉంటాయి.

వ్యాధుల కాలం : ఇటీవలి భారీ వర్షాలతో దోమల సంఖ్య విపరీతంగా పెరిగింది. పురపాలక అధికారులు ఫాగింగ్ చేసిన ఒకటెండ్రు రోజుల వరకు కాస్త తగ్గుతుండగా మళ్లీ విజృంభిస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలు మరిన్ని సమస్యలకు కారణంగా తయారయ్యాయి. నీరు నిల్వ ఉండటంతో లార్వా తయారైంది. పైగా అందులోంచి క్రిమికీటకాలు, పందులు, పశువుల సంచారం జనాన్ని ఇబ్బంది పెడుతోంది.

నామమాత్రంగా హెచ్చరిక నోటీసులు : పట్టణాలు, నగరాల్లో నివాసిత ఇళ్ల మధ్యన ఖాళీ స్థలాలు ఉండగా వాటి నిర్వహణ సరిగా ఉండటం లేదు. పట్టణ ప్రగతి కార్యక్రమంలో ఖాళీ స్థలాలు గుర్తించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ప్రజారోగ్యానికి హాని కలిగించొద్దని హెచ్చరిక నోటీసులు ప్రదర్శిస్తున్నా పరిస్థితిలో మాత్రం మార్పు రావడం లేదు. కనీసం అందులో బేస్‌మెంటు మేర మొరం కాని, నీరు నిల్వ ఉండకుండా, చెట్లు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవడం కానీ చేయడం లేదు. మూడేళ్ల కిందట కరీంనగర్ భగత్‌నగర్‌లో కాలనీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో చుట్టూ ఉన్న ఖాళీ స్థలాల్లో మొరం పోయించుకొని ఆదర్శంగా నిలిచారు. అలాగే నగరాలు, పట్టణాల్లో సమష్టిగా ముందుకొస్తే ఆరోగ్యకర సమాజం నిర్మితమవుతుంది.

పట్టణవాసుల్లో స్పందన ఏదీ? : ఖాళీ స్థలాలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా నగర, పురపాలికల పారిశుద్ధ్య విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండగా ప్రజల్లో స్పందన ఉండటం లేదంటున్నారు. ఇళ్లలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, ఇంటి ముందు, వెనుకాల చెత్తా చెదారం, వ్యర్థాలు పడేయకూడదని ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు అంటిస్తుండగా కొందరు పట్టనట్లుగా ఉంటున్నారు. ఖాళీ స్థలాలు శుభ్రం చేసుకోవాలని అధికారులు పదే పదే కోరుతుండగా ఇంటి యజమానులు నిర్లక్ష్యం చూపుతుండగా కొందరు ప్రజాప్రతినిధులు వారికి వత్తాసు పలుకుతున్నారు. దగ్గరుండి వాటిని శుభ్రం చేసుకునేలా ప్రోత్సహించాల్సిన వారే నిర్లక్ష్యానికి తావిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో సాగి ఖాళీ స్థలాలు శుభ్రంగా ఉండేలా చూస్తే జనానికి వ్యాధుల ముప్పును తగ్గించినవారవుతారు.

# పారిశుద్ధ్యంపై ప్రత్యేక కార్యాచరణ



భూపాలపల్లి : వరుణుడి ప్రతాపం.. వరదల ప్రవాహంలో చిక్కుకున్న పల్లెలు ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నాయి.. గతంలో ఎన్నడూ లేనివిధంగా అధిక వర్షాలు దంచికొట్టడంతో జిల్లా వ్యాప్తంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చాలా గ్రామాల్లో ఇళ్లలోకి వరద రావడంతో నిరాశ్రయులను పునరావాస కేంద్రాలకు తరలించారు. ఇప్పుడిప్పుడే వానలు తగ్గుముఖం పడుతుండటంతో ప్రజలు కాస్త ఊపిరి పీల్చుకుంటున్నారు. అధిక వర్షాల అనంతరం పరిసరాలు చిత్తడిగా తయారై అపరిశుభ్రంగా ఉండటం, ఎక్కడ పడితే అక్కడ నీరు నిల్వ ఉంటుండటంతో చాపకింద నీరులా అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. దీంతో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి అన్ని గ్రామాల్లో పనులను చేపడుతున్నారు.

**కలెక్టర్ ఆదేశాల మేరకు..**

జిల్లాలోని 241 గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను పక్కాగా అమలు చేసేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. గ్రామాల్లో దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఆయిల్ బాల్స్ తయారు చేస్తున్నారు. చెక్కపొట్టు, లేదా వరి పొట్టును ఒక వస్త్రంలో చుట్టి ఇంజిన్ ఆయిల్‌లో ఒక రోజు ముందుగా వేసి తర్వాత రోజు నిల్వ నీటిలో వేస్తున్నారు. దీంతో నీటిలో ఆయిల్ పేరుకుపోయి దోమ లార్వా చనిపోతుండటంతో ఎక్కువగా ఈ పద్ధతినే పాటిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పలు పంచాయతీల్లో ఫాగింగ్, స్ప్రే యంత్రాలతో దోమల మందు పిచికారీ చేస్తున్నారు. నిత్యం మురుగు కాల్వల శుభ్రం చేయడం, బ్లీచింగ్ చల్లడం, లోతట్టు ప్రాంతాల్లోని నీటి నిల్వలను తొలగించడం, ప్రతి వారం మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయడం, డ్రై డే పాటించేలా, అంటువ్యాధులు ప్రబలకుండా గ్రామ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

**ఉదయం నుంచే విధుల్లోకి..**

పారిశుద్ధ్యం పక్కాగా అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. ప్రతి పంచాయతీ కార్యదర్శి వారి వారి గ్రామ పరిధిలో ఉదయం 7 గంటలకే గ్రామాల్లో ఉండి పారిశుద్ధ్య పనులు పర్యవేక్షించేలా ఆదేశాలున్నాయి. ఉదయం 7 గంటలకు గ్రామంలో డైలీ శానిటైజేషన్ రిపోర్టు(డీఆర్ఎస్)లో హాజరు నమోదు చేయాలి. డీఆర్ఎస్ యాప్ ద్వారా లైవ్ ఫొటో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. డీపీవో స్థాయి నుంచి డీఎల్‌పీవో, ఎంపీవో ప్రతి ఒక్కరూ నిత్యం ఏదో ఒక గ్రామాన్ని సందర్శించి పారిశుద్ధ్యంపై సంబంధిత గ్రామ పంచాయతీ సిబ్బందికి అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తున్నారు.

**నిత్యం పనులు చేపడుతున్నాం**

**ఆశాలత, జిల్లా పంచాయతీ అధికారి**

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని 241 గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాం. దోమల నివారణకు నిల్వ నీటిలో ఆయిల్ బాల్స్ వేయడం, ఫాగింగ్ చేయడం, అంటువ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ చల్లడం తదితర పనులు చేపడుతున్నాం. పారిశుద్ధ్య నిర్వహణపై ఒక ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తూ నిత్యం గ్రామాల్లో పారిశుద్ధ్యం విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

# వారాంతంలో ఆర్టీసీకి జోష్!




కరీంనగర్ : టీఎస్ ఆర్టీసీకి వారాంతంలో కాసుల వర్షం కురుస్తుంది. ఇతర రోజులతో పోల్చి చూస్తే శని, ఆది, సోమవారాల్లో బస్సుల్లో ప్రయాణించే వారి సంఖ్య మరింత పెరుగుతోంది. దీంతో సంస్థకు ఆదాయం అధికంగా వస్తోంది. ఆర్టీసీ కొత్త బస్సులు సమకూర్చుకోవడం, ప్రైవేట్ వాహనాలకు దీటుగా వెళ్తుండటంతో బస్సు సర్వీసుల్లో ప్రయాణించే వారి సంఖ్య పెరిగింది.

హైదరాబాద్ మార్గంలోనే..కరీంనగర్ రీజియన్‌లో 11 డిపోల పరిధిలో 869 బస్సులు ఉండగా ఇందులో 300లకు పైగా బస్సులు హైదరాబాద్ మార్గంలోనే నడుస్తాయి. ముఖ్యంగా శని, ఆదివారాల్లో జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుండగా, ఆదివారం సాయంత్రం, సోమవారం కరీంనగర్ నుంచి జేబీఎస్‌కు ప్రయాణికులు అధికంగా వెళ్తున్నారు. ఆదివారం విద్యా సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలకు సెలవుదినం కావడంతో బస్సుల సంఖ్యను తగ్గించి రద్దీ రూట్లలో నడుపుతున్నారు. సోమవారం మాత్రం జేబీఎస్ రూట్లో మరో పదిశాతం అదనంగా బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఆర్టీసీ కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎన్.సుచరిత మాట్లాడుతూ వారంలో మిగతా రోజులతో పోలిస్తే సోమవారం రద్దీ ఎక్కువగా ఉంటుందని తెలిపారు. దీంతో సికింద్రాబాద్ రూట్లో రద్దీకి అనుగుణంగా బస్సులను పెంచుతున్నామని చెప్పారు. శని, ఆదివారాల్లో కూడా కొంతమేర ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉంటుందని తెలిపారు. వినాయక నవరాత్రోత్సవాలు ఉండటంతో ఈ వారాంతం కొంత ఆదాయం తగ్గిందని చెప్పారు.

రోజువారీగా..కరీంనగర్ రీజియన్‌లో 11 డిపోలు ఉండగా వాటి పరిధిలో 869 బస్సులు ఉన్నాయి.నిత్యం 2.40 లక్షల నుంచి 2.50 లక్షలకుపైగా ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు ప్రయాణాలు సాగిస్తుంటారు. వారాంతాలు మినహాయిస్తే మిగతా రోజుల్లో సగటున రూ.1.30 కోట్ల వరకు ఆదాయం వస్తుంది. శని, సోమవారాలు మాత్రం ఆదాయం పెరుగుతుంది. శనివారాలు ఇతర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చేవారు.. సోమవారం తిరిగి వెళ్తుండటంతో ఈ రెండు రోజుల ఆదాయం పెరుగుతోంది. ముఖ్యంగా సోమవారం ఇది మరింత ఎక్కువగా ఉంటుంది. ఈ నెల 11వ తేదీ (సోమవారం) అత్యధికంగా రూ.1.91 కోట్ల ఆదాయం రావడం గమనార్హం. 9న (శనివారం) రూ.1.54 కోట్లు, 10న (ఆదివారం) రూ.1.62 కోట్లు సంస్థ ఆర్జించింది. గత వారాంతం 23వ తేదీన రూ.1.28 కోట్లు ఆర్జించగా, 24న రూ.1.16 కోట్లు, 25న 1.57 కోట్ల ఆదాయం వచ్చింది. వినాయక నవరాత్రి ఉత్సవాలు కావడంతో ప్రయాణికుల రాకపోకలు తగ్గి ఆదాయం కొద్దిగా తక్కువ వచ్చిందని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

# ఇసుక తవ్వేస్తూ.. దర్జాగా తరలిస్తూ!



కరీంనగర్ : ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలోని వాగులు వంకల్లో నీరు నిలిచింది. దీంతో అన్ని ప్రదేశాల్లో ఇసుక తవ్వడం కుదరడం లేదు. ముఖ్యంగా ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన రీచ్‌ల నుంచి ఇసుకను తీసే పరిస్థితి లేదు. దీంతో రీచ్‌లు కాని ప్రదేశాల్లో అందుబాటులో ఉన్న ఇసుకపై వ్యాపారులు కన్నేశారు. కొన్ని రీచ్‌లలో తవ్వకాలు జరుగుతున్నా.. అక్కడి ధరకన్నా తక్కువ మొత్తంతోనే దొడ్డిదారిన తెచ్చిన దాన్ని విక్రయిస్తూ అడ్డదారిలో సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రీచ్‌ల వద్ద ఇసుక కోసం ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటే ఒక ట్రాక్టర్‌కు రూ.2500 వరకు వస్తుండగా బయట వ్యాపారులు నిర్ణీత దూరాన్ని బట్టి రూ.1800-2000 వరకే విక్రయిస్తూ లాభాల్ని మూటగట్టుకుంటున్నారు. ఇలా జిల్లాలోని కరీంనగర్ సమీపంలోని ఖాజీపూర్, ఎలగందుల, ఇరుకుల్ల, బొమ్మకల్. దుర్శేడ్, చేగుర్తి, గోపాల్‌పూర్ సరిహద్దుల నుంచి రోజుకు 1200లకు పైగా ట్రిప్పుల ఇసుకను రేయింబవళ్లు తరలిస్తున్నారు. ఒక్కో వాహనదారు రోజులో అయిదారు ట్రిప్పులు తరలిస్తూ కూలీల ఖర్చు పోను రోజుకు రూ.8 వేల వరకు సంపాదిస్తున్నారు. మానకొండూర్ మండలంలోని లింగాపూర్, శ్రీనివాస్‌నగర్, వీణవంక, శంకరపట్నం, జమ్మికుంట మండలాల్లోని దాదాపు 12 గ్రామాల చెంతన ఈ దందా విపరీతంగా పెరుగుతోంది. ఇంటి నిర్మాణాలు జోరుగా జరుగుతుండటంతో డిమాండ్ పెరిగింది. అదే అదనుగా రోజుకు జిల్లా వ్యాప్తంగా 2500కుపైగా ట్రాక్టర్ల ఇసుక దోపిడీకి గురవుతోంది. వీటి ద్వారా నిత్యం దాదాపుగా రూ.40 లక్షలకుపైగా వ్యాపారం సాగుతున్నట్లు తెలుస్తోంది. ఇదంతా సర్కారు ఖజానాకు చేరకుండా గండి పడుతుండటం గమనార్హం.!

మానకొండూర్ సమీపంలోని శ్రీనివాస్ నగర్ చెంతన ఉన్న చెక్‌డ్యామ్ వద్ద నీటి జాలు నుంచి దర్జాగా ట్రాక్టర్లను తీసుకెళ్తున్నారు. మానేరు పరీవాహక ప్రాంతంలో నీటి ప్రవాహం లేని చోటు నుంచి నిత్యం వందలాది ట్రిప్పులను తరలిస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. దొడ్డిదారిన దోచుకెళ్తున్న ఇసుక కాబట్టి వాహనాల్ని ప్రమాదకర ప్రాంతాల నుంచి తీసుకెళ్తున్నారు.చూసీ చూడనట్లుగానే..! : ఎన్నికల సీజన్ అవడంతో చోటామోటా నాయకుల పైరవీలు ఎంచక్కా సాగుతున్నాయి. పోలీసులు, రెవెన్యూ మైనింగ్ అధికారులు ఇసుక వాహనాలు కనిపించినా చూసీచూడనట్లు ఊరుకుంటున్నారు. ఎక్కడైనా ఏదైనా వాహనాన్ని ఆపిన కాసేపటికే పెద్దల నుంచి ఫోన్‌లు వస్తుండటంతో వదిలేస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొన్ని మండలాల పరిధిలో అధికారులు, పోలీసుల కనుసన్నల్లో ఈ దందా ఇంతకింతకు పెరుగుతోంది. పైగా వాగులు, వంకల్లో చాలాచోట్ల నీళ్లున్నాయనే భ్రమతోనే ఈ దందా తీరుపై అంతగా సంబంధిత పర్యవేక్షణ అధికారులు దృష్టి సారించడం లేదనేది తెలుస్తోంది. ఇదే అదనుగా అక్రమార్కులు మాత్రం రెచ్చిపోతున్నారు. మసక చీకట్లో, తెల్లవారు జామున ఎవరి కంటపడకుండా ఎక్కువ మొత్తంలో సహజ సంపదను కొల్లగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇక పలుకుబడి కలిగినవాళ్లు లేదా తమల్ని ఎవరు ఆపుతారనే ధీమా ఉన్నవారు పగటి వేళల్లోనూ ఎంచక్కా తవ్వేస్తూ వాహనాల్లో తరలిస్తున్నారు.తప్పకుండా చర్యలు తీసుకుంటాం : ఏ ఏ ప్రాంతాల్లో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారనే విషయంపై నిఘా పెడుతాం. పోలీసుల సహకారంతో వాహనాల్ని పట్టుకుంటాం. తప్పకుండా అక్రమ రవాణాను అడ్డుకుంటాం. మానేరు నది పరీవాహక ప్రాంతంలోని సహజ సంపదను పరిరక్షిస్తాం. తగు చర్యల్ని తీసుకుంటాం.మహేశ్వర్, ఆర్డీవో, కరీంనగర్

# బీసీ కుల వృత్తిదారులకు శుభవార్త

హుజూరాబాద్:ప్రభుత్వం అందించే రూ.లక్ష సాయం కోసం దరఖాస్తు చేసుకున్న బీసీ కుల వృత్తిదారులకు శుభవార్త. జిల్లాకు రూ.12 కోట్ల నిధులు విడుదల చేసింది. ఇప్పటి వరకు ఎదురుచూపుల్లో ఉన్న వేలాది మందిలో ఆశలు చిగురించాయి. మరో వైపు ఇప్పటికే పలువురు బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంతోపాటు ఎమ్మెల్యేలు, సంఘాల నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పంపిణీ చేయడానికి అధికారులు చర్యలు ముమ్మరం చేశారు.

**52 మందికి పంపిణీ**

బీసీ కులవృత్తుల వారికి రూ.లక్ష ఆర్థిక సాయం ప్రభుత్వం ప్రకటించిన అనంతరం జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. జూన్ 9న ప్రయోగాత్మకంగా కొందరికి, గత నెల 15న మరికొందరికి మొత్తం 52 మందికి చెక్కులు అందజేశారు. గత నెలలో నియోజవర్గానికి 300 మందిని ఎంపిక చేసి ఈ సాయం అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించినా.. నిధులు రాకపోవడం, కొన్ని నియోజకవర్గాల్లో అర్హుల జాబితా సిద్ధం కాకపోవడం వంటివి ప్రతిబంధకంగా మారాయి. మరో వైపు పలు సంఘాలు, పలువురు నాయకులు తమ వారికి ఈ సాయాన్ని అందించేలా ఎవరికి వారే పావులు కదుపుతున్నారు.

**నియోజకవర్గానికి రూ.3 కోట్లు**

రూ.లక్ష ఆర్థిక సాయం అందించేందుకు జిల్లాలోని ప్రతి నియోజకవర్గానికి 300 మందికి అవసరమైన రూ.3 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటికే క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులు పరిశీలన చేసి తుది పరిశీలనకు పాలనాధికారికి, జిల్లా మంత్రికి అందజేశారు. కరీంనగర్, హుజూరాబాద్ పూర్తి నియోజకవర్గాలతో పాటు జిల్లా పరిధిలోకి వచ్చే హుస్నాబాద్, చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాలకు చెందిన అర్హుల జాబితాలను అధికారులు సిద్ధం చేశారు. బుధవారం కరీంనగర్‌లో జిల్లా మంత్రి కమలాకర్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం పంపిణీ, అర్హుల ఎంపికపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహిస్తున్నారు. అనంతరం ఒకటి, రెండు రోజుల్లో అర్హులకు ఆర్థిక సాయం అందించనున్నారు.

**ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా..**

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం బీసీ కులవృత్తుల అర్హులకు రూ.లక్ష ఆర్థిక సాయం అందజేస్తాం. ఇప్పటికే నిధులు విడుదల చేసింది. అర్హుల జాబితాలను సంబంధిత అధికారులు రూపొందించారు. ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో త్వరలో చెక్కులు పంపిణీ చేస్తాం.

# నిబంధన లే అవుట్

పెద్దపల్లి : 'భవనాలు, ఖాళీ స్థలాలు కొనుగోలు చేయాలనుకుంటున్నారా.. అయితే వర్షాకాలంలోనే కొనేయండి.. ఎందుకంటే ఏ ప్రాంతం లోతట్టులో ఉందో.. ఏ కాలనీ చెరువుగా మారుతుందో.. తెలిసేది ఇప్పుడే..' అంటూ ఓ సందేశం ఇటీవలి వర్షాల సమయంలో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. దీనికి నెటిజన్ల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. అనధికార లే అవుట్లకు ఈ సందేశం అద్దం పడుతోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో డీటీసీపీ(డిపార్ట్‌మెంట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్) గుర్తింపు ఉన్న లేఅవుట్లు పదుల సంఖ్యలో ఉంటే అనధికారిక లేఅవుట్లు వేల సంఖ్యలో ఉంటున్నాయి. ఖాళీ స్థలం కనబడితే చాలు ప్లాట్లుగా మార్చి విక్రయిస్తుండటంతో వరదల వేళ చెరువులను తలపిస్తున్నాయి.

**నోటీసులు ఇచ్చి చేతులెత్తేస్తున్నారు**

కొత్త పురపాలక చట్టం అమలులోకి వచ్చినా అక్రమ లే అవుట్లు యథేచ్ఛగా ఏర్పాటవుతున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 560 కంటే ఎక్కువగా అనధికార అక్రమ లే అవుట్ల యజమానులకు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. అధికారులు వచ్చి హద్దులు తొలగిస్తే, అనంతరం యజమానులు వచ్చి తిరిగి ఏర్పాటు చేసుకుంటున్నారు.

నిబంధనల మేరకు లే అవుట్లలో 10 శాతం ఖాళీ స్థలాన్ని స్థానిక సంస్థల పేరిట రిజిస్ట్రేషన్ చేయించకుంటే సదరు డెవలపర్ నుంచి భారీగా జరిమానా వసూలు చేయాలని కలెక్టర్లు సూచించినా అమలుకు నోచుకోవడం లేదు. మున్సిపాలిటీ పేరిట ఈ ఖాళీ స్థలంలో మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని చెప్పినా ఫలితం లేకుండా పోయింది. మాస్టర్ ప్లాన్‌లో రెసిడెన్షియల్ జోన్‌లో ఉండే ఖాళీ స్థలానికి నిబంధనల ప్రకారం భవన నిర్మాణ అనుమతులు ఇచ్చే అవకాశాలున్నాయని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు చెబుతున్నారు. క్రమబద్ధీకరణ రుసుముతో పాటు మొత్తం స్థలం మార్కెట్ విలువపై 14 శాతం ఓపెన్ స్పేస్ రుసుములు చెల్లించాల్సి ఉంటుంది. అదనంగా స్థలం మార్కెట్ విలువలో 33 శాతం డబ్బులు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన అనధికారిక, అక్రమ



లేఅవుట్లపై ప్రభుత్వం కొరడా ఝళిపించేందుకు సిద్ధమైనప్పటికీ పాలకవర్గాలు, అధికారులు మామూళ్ల మత్తులో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

పట్టణ ప్రగతి నిర్వహణ సమయంలో అనధికారిక ప్లాట్లను గుర్తించి తొలగించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ వైబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది.

**ఆరోపణలు నిజమనిపించేలా..**

అక్రమ లేఅవుట్ల ఏర్పాటులో పట్టణ ప్రణాళిక అధికారులు పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు గతంలో వినిపించాయి. పట్టణ శివారు ప్రాంతాల్లో వెలిసిన నిర్మాణాలకు డీటీసీపీ అనుమతులు లేవు. ఇష్టారాజ్యంగా ప్లాట్లు చేసి విక్రయిస్తున్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. స్థిరాస్తి వ్యాపారులు చెరువులు, కుంటలను ఆక్రమించి లే అవుట్లు వేశారు. అధికారులు స్థానిక సంస్థల్లో తక్కువ సంఖ్యలో లేఅవుట్లు ఉన్నట్లు చూపడం.. లేఅవుట్ల వివరాలు అడిగితే సమాచారం ఇవ్వకపోవడం.. దాటేస్తుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# బజారుకెక్కిన బీఆర్ఎస్ పంచాయితీ

సంగారెడ్డి : జిల్లా కేంద్రమైన సంగారెడ్డి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీలో నెలకొన్న విభేదాలు వీధికెక్కాయి. అధికార పార్టీకే చెందిన చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మిరవికి సొంత పార్టీ కౌన్సిలర్లతో పొసగడం లేదు. సంగారెడ్డి మున్సిపాలిటీలో 38 మంది కౌన్సిలర్లు ఉండగా ఇందులో 24 మంది బీఆర్ఎస్ సభ్యులు ఉన్నారు. చైర్‌పర్సన్‌గా ఎన్నికైన బొంగుల విజయలక్ష్మీరవి మూడేళ్ల పదవీకాలం పూర్తవడంతో ఆమెపై సొంతపార్టీ కౌన్సిలర్లు ప్రతిపక్షాలతో కలిసి అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇచ్చారు. రెండు నెలల కిందట కలెక్టర్‌కు ఇచ్చిన అవిశ్వాస తీర్మానం నోటీసుపై 19 మంది కౌన్సిలర్లు సంతకాలు చేయగా ఇందులో 15 మంది బీఆర్ఎసకు చెందిన వారే కావడం విశేషం. అయితే అవిశ్వాస తీర్మాన నోటీసుపై ఎటువంటి చర్యలు చేపట్టరాదని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. జిల్లాకు చెందిన మంత్రి హరీశ్‌రావు చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మిరవిని కొనసాగించడానికే మొగ్గుచూపడంతో అసమ్మతి కౌన్సిలర్లు చైర్‌పర్సన్ అవినీతిపై విమర్శలు గుప్పిస్తున్నారు.

నకిలీ ఉద్యోగులకు చైర్‌పర్సన్ అండ

మున్సిపాలిటీలో నీటి సరఫరా, ఇంజనీరింగ్, శానిటేషన్, రెవిన్యూ, పాలనా విభాగంలో 419 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో కొందరు మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మిరవి మద్దతుతో పనిచేయకుండానే జీతాలు తీసుకుంటున్నారని కౌన్సిలర్లు బోయిని విజయలక్ష్మి, చాకలి స్వప్న ఇటీవలే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో కమిషనర్ చంద్రశేఖర్ ఈ నెల 20న ఉద్యోగులందరినీ పిలిపించి కౌన్సిలర్ల సమక్షంలో వివరాలను నమోదు చేసుకున్నారు. వీరిలో ఆరుగురు ఉద్యోగులు హైదరాబాద్‌కు చెందినవారున్నారు. వీరందరూ చైర్‌పర్సన్ మనుషులని, పని చేయకుండానే జీతాలు తీసుకుంటున్నారని అసమ్మతి కౌన్సిలర్లు ఆరోపించారు. కానీ ఆ ఉద్యోగులు వివిధ విభాగాల్లో పనిచేస్తున్నట్టు అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు ఉండడం గమనార్హం. ఇదే సందర్భంలో బీఆర్ఎస్ కౌన్సిలర్ ఒకరు మాట్లాడుతూ అక్రమ ఇంటి నిర్మాణాలు చేసిన యజమానుల దగ్గర బీఆర్ఎస్ కౌన్సిలర్లు లక్షల రూపాయలు తీసుకుని ఇంటి నెంబర్లు ఇప్పిస్తున్నారని అధికారుల సమక్షంలోనే ఆరోపించారు. దాంతో పాలక వర్గంలోని బీఆర్ఎస్ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం గందరగోళానికి దారి తీసింది.

చింతా ప్రభాకర్ ఆవేదన

సంగారెడ్డి పార్టీలో జరుగుతున్న ఈ పరిణామాల పట్ల మాజీ ఎమ్మెల్యే చింతాప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్‌లోని వ్యవహారాలను కొందరు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న చింతాప్రభాకర్‌ను పార్టీలోని విభేదాలు ఆందోళనకు గురిచేస్తున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ వ్యవహారాలను పరిశీలిస్తుంటే సంగారెడ్డిలో పార్టీ పరిస్థితి మళ్లీ మొదటికి తెచ్చేలా కనిపిస్తున్నదని చింతాప్రభాకర్, పార్టీ నాయకులు అభిప్రాయపడ్డట్టు తెలిసింది.

# ముందుకు సాగక.. అందుబాటులోకి రాక..

మెదక్ : పట్టణాల్లో నివసిస్తున్న ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఆ దిశగా పురపాలికల్లో కూరగాయలు, మాంసం, ఇతరత్రా ఒకే చోట విక్రయించేలా సమీకృత మార్కెట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గజ్వేల్, సిరిసిల్ల మార్కెట్ల తరహాలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో సముదాయాలు నిర్మించాలని నిర్ణయించారు. తూప్రాన్‌లో మాత్రమే అందుబాటులోకి రావడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఆయా చోట్ల నెలకొన్న పరిస్థితిపై కథనం.

నిధులు వెనక్కి..

నర్సాపూర్‌లో సదరు నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరయ్యాయి. సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా నర్సాపూర్ పురపాలికకు కేటాయించిన రూ.25 కోట్లలో నుంచి రూ.4 కోట్లు సైతం దీనికి కేటాయించారు. పాత తహసీల్దారు కార్యాలయ స్థలంలో పనులు మొదలుపెట్టారు. పునాదులు తీసి, పిల్లర్లు నిర్మించి వదిలేశారు. రెండు నెలల కిందట నిలిచిపోయాయి. ప్రస్తుతం సమీకృత మార్కెట్ నిర్మాణానికి కేటాయించిన రూ.6 కోట్లలో నుంచి రూ.3 కోట్లు పురపాలికకు మళ్లించాలని



ఇటీవల జరిగిన పుర సమావేశంలో నిర్ణయించారు. దీంతో రూ.3 కోట్లే మిగిలే అవకాశం ఉంది.

ఎట్టకేలకు పడిన అడుగు..

జిల్లా కేంద్రంలో సమీకృత మార్కెట్‌కు రూ.4.50 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానాన్ని ఎంపిక చేసి పనులు ప్రారంభించారు. స్థానికులు అభ్యంతరం తెలిపి హైకోర్టును ఆశ్రయించారు. స్టే రావడంతో నిర్మాణం నిలిచిపోయింది. తాజాగా పట్టణంలోని నీటిపారుదల శాఖ కార్యాలయ ఆవరణలోని రెండున్నర ఎకరాల స్థలాన్ని కేటాయించారు. దీంతో గుత్తేదారు పనులు మొదలుపెట్టారు. ప్రస్తుతం కూరగాయల విక్రయాలు పట్టణంలోని బహిరంగ ప్రదేశాల్లో కొనసాగుతున్నాయి. ఎండకు ఎండి, వానకు తడుస్తూ చలికి వణుకుతూ అమ్ముతున్నారు. ఇరుకైన స్థలంలో అమ్మకాలు సాగిస్తుండగా తరచూ ట్రాఫిక్ చిక్కులు ఎదురవుతున్నాయి.

పిల్లర్ల స్థాయిలో..రామాయంపేట మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ పిల్లర్ల దశలో ఉంది. గతంలో రూ.50 లక్షలతో రైతుబజారు నిర్మాణం చేపట్టారు. కొద్ది రోజులు విక్రయాలు సాగించగా, ప్రస్తుతం నిలిచిపోయాయి. అక్కడి నుంచి చర్చి మైదానంలో తాత్కాలికంగా టార్పాలిన్ కవర్లతో కప్పు ఏర్పాటు చేసుకొని చిరువ్యాపారులు నెట్టుకొస్తున్నారు. ఆరు నెలల్లో పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. రూ.1.54 కోట్లు మంజూరు చేశారు. 14 దుకాణాలు మాంసం, 28 దుకాణాలను కూరగాయలు, పండ్ల విక్రయాలకు కేటాయించనున్నారు. అన్ని సౌకర్యాలు కల్పించేలా ప్రణాళిక రూపొందించారు. రామాయంపేట

# పెట్టుబడి అదనం.. దిగుబడి గండం



ఖమ్మం : అకాల వర్షం మొక్కజొన్న రైతులను కుదేలు చేసింది. ఈదురుగాలుల బీభత్సంతో వేలాది ఎకరాల్లో పంటలు నేలకొరిగి పీకల్లోతు కష్టాల్లో ఉన్న సాగుదారులకు ఇప్పుడు అసలు పరీక్ష ఎదరవుతోంది. నేలకొరిగిన పంట చేతికందాలంటే అదనపు భారం తప్పేలా లేదు. పైగా నేలవాలిన పంటలో అత్యధిక కంకులు కుళ్లిపోవడం, రంగుమారటంతో దిగుబడి తగ్గుతుందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అసలు పరీక్ష ఇప్పుడే..

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఈ సీజన్‌లో 1,16,000 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేశారు. ప్రస్తుతం సుమారు 100 రోజుల పంటగా ఉంది. మరో 20 రోజుల్లో చేతికందాల్సిన తరుణంలో ఈదురుగాలులు, అకాల వర్షానికి చాలాచోట్ల పైరు దెబ్బతింది. ఖమ్మం జిల్లాలో 10,260 మంది రైతులకు చెందిన 20,547 ఎకరాల్లో, భద్రాద్రి జిల్లాల్లో 64 మందికి చెందిన 174 ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించారు. వాస్తవానికి చేతికొచ్చిన మొక్కజొన్న కంకులను తీసేందుకు ఎనిమిది కూలీలకు రోజుకు రూ.300 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. మిషన్ సాయంతో కంకులు కోయాల్సి వస్తే ఎకరాకు రూ.3200 ఖర్చయ్యేది. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో నేలవాలిన కంకులను కోయడం రైతులకు భారంగా మారనుంది. అదే కూలీలకు రూ.600 చొప్పున, యంత్రం సాయంతో తీయాల్సి వస్తే ఎకరాకు రూ.4500 వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. మరో 20 రోజులు పంటను కాపాడుకునేందుకు సరైన యాజమాన్య పద్ధతులు, ఎరువుల కోసం అదనంగా పెట్టుబడి పెట్టాల్సిందే.

అడియాసలేనా..?

వాస్తవానికి ఈ సీజన్ మొదటి నుంచి వాతావరణం అనుకూలంగా ఉండటం, సాగునీరు సమృద్ధిగా లభించటం వల్ల మొక్కజొన్న దిగుబడులపై రైతులు గంపెడాశలు పెట్టుకున్నారు. ఎకరాకు సుమారు 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. గాలివాన బీభత్సంతో పరిస్థితి మారిపోయింది. మొక్కజొన్న కంకులు నేలవాలి జీవం కోల్పోతున్నాయి. ఇప్పటికే చేతికొచ్చిన ప్రాంతాల్లో కల్లాల్లోని మొక్కజొన్న తడిసి రంగు మారుతోంది. దిగుబడులు గణనీయంగా పడిపోతాయని రైతులు దిగులు చెందుతున్నారు. ఎకరాకు కనీసం 20–30 క్వింటాళ్లు దాటే పరిస్థితుల్లేవని చెబుతున్నారు. నష్టపోయిన పంటకు పరిహారం అందించడంతోపాటు గిట్టుబాటు ధర రూ.2,500 కల్పించి కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

12 ఎకరాలు కౌలుకు తీసుకుని మొక్కజొన్న సాగు చేశాను. ఎకరాకు రూ.20 వేల కౌలుతోపాటు రూ.30వేల చొప్పున పెట్టుబడులు పెట్టాను. అకాల వర్షంతో నేలవాలిన పంట చేతికొచ్చే పరిస్థితి లేదు. ఈ పంటను తీయడం మరింత భారంగా మారుతుంది. ఎకరాకు కనీసం రూ.10 వేలు ఖర్చు చేయాలి. దిగుబడి బాగా పడిపోతుంది. పెట్టుబడులు పూడే అవకాశమే లేదు.
సుధాకర్, రైతు, కొణిజర్ల

ఐదెకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తే సగానికి పైగా పంట నేలవాలింది. కంకులను ఎలుకలు పాడు చేస్తాయి. చెదలు పట్టి కంకులు పనికిరాకుండా పోతాయి. తీద్దామంటే కూలీలు, యంత్రాల ఖర్చు ఎక్కువవుతుంది. గిట్టుబాటు ధర పెంచి కొంటేనే కొంతైనా గట్టెక్కుతాం.
వెంకటేశ్వర్లు, రైతు, బస్వాపురం, కొణిజర్ల మండలం

# స్వీయ మదింపు.. అక్రమాలకు నెలవు!



ఖమ్మం : పట్టణవాసులకు సేవలను సులభంగా, వేగంగా అందించేందుకు పురపాలక శాఖ యత్నిస్తోంది. ఈనేపథ్యంలోనే రెండేళ్ల క్రితం స్వీయ మదింపు ద్వారా ఇంటినంబర్లు తీసుకునే వెసులుబాటు కల్పించింది. స్థానిక అధికారులతో సంబంధం లేకుండా నేరుగా పురపాలక ప్రధాన కార్యాలయం నుంచే ఇంటినంబరు వచ్చేది. అందుకే ప్రభుత్వ స్థలాల్లో కొందరు గదులు నిర్మించుకుని ఇంటినంబర్లు తీసుకున్నారు. నష్టాన్ని ఆలస్యంగా గుర్తించిన ఉన్నతాధికారులు స్వీయమదింపు ద్వారా ఇంటినంబరు జారీ చేసే ముందు తప్పనిసరిగా స్థానిక పురపాలక అధికారులు పరిశీలించాలని ఉత్తర్వులిచ్చారు.

ఫిర్యాదు చేస్తేనే..

జిల్లాల పునర్విభజన తర్వాత పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోని భూములకు రెక్కలొచ్చాయి. ప్రభుత్వ స్థలాలకు తప్పుడు పత్రాలు సృష్టించి ఇంటినంబర్లు తీసుకుంటారు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై అధికారులు పూర్తిస్థాయిలో దృష్టిసారించడం లేదనే విమర్శలున్నాయి. ఎవరైనా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తేనే చర్యలకు ఉపక్రమిస్తున్నారు. హైదరాబాద్‌లో ఇలా..ఆన్‌లైన్‌లో ప్రస్తావించినట్లు ఇంటి కొలతలు, గృహం, భూమి రకం తదితరాలను పరిశీలించి నిబంధనలకు అనుకూలంగా ఉంటేనే ఇంటినంబరును అధికారులు జారీ చేస్తున్నారు. కొందరు వ్యక్తులు ప్రభుత్వ భూముల్లో గదులు నిర్మించి అధికారులకు ఎంతోకొంత ముట్టజెప్పి గుట్టుచప్పుడు కాకుండా ఇంటినంబరు తీసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. తాజాగా హైదరాబాద్ మహానగరపాలక సంస్థ పరిధిలో 25వేల ఇంటినంబర్లను దొంగపత్రాలతో పొందినట్లు గుర్తించారు. డివిజన్ల వారీగా క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటిని బ్లాక్ చేశారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోనూ ఈ ప్రక్రియను ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నారు.

తప్పుడు తేదీలతో..ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టిన వారికి ఆస్థలాలను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం జీవో నంబర్లు 58, 59 జారీ చేసింది. అనంతరం జీవో నంబర్ 14ను తీసుకొచ్చింది. 58, 59 జీవోల్లోని నిబంధనలనే అమలుచేస్తామని ఉత్తర్వుల్లో ప్రస్తావించింది. ఆక్రమణల్లోని ప్రభుత్వ స్థలాలను పేదలకు క్రమబద్ధీకరించాలనే అంశం రియల్ వ్యాపారుల పాలిట వరంలా మారింది. ప్రభుత్వ స్థలాల్లో గదులను నిర్మించి పాత తేదీలతో ఇప్పటికే ఇంటినంబర్లు తీసుకున్నారు. మరికొన్నింటిని తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. రాజకీయ ఒత్తిళ్లు ఉండటంతో చేసేదేమీ లేక ఇంటినంబర్లను అధికారులు జారీ చేస్తున్నారు. తాజాగా మంత్రివర్గ ఉపసంఘం–2020 కంటే ముందు ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఏర్పర్చుకున్న స్థలాలను క్రమబద్ధీకరించుకునేందుకు గడువు పొడిగించిన నేపథ్యంలో ఇంటినంబర్లు తీసుకునేందుకు చకచకా పావులు కదుపుతున్నారు.

ఏప్రిల్ 1 నుంచి ప్రత్యేక బృందాలతో వార్డుల వారీగా తనిఖీ చేస్తాం. సెల్ఫ్‌నంబర్లు తీసుకుని ఇంటిపన్ను చెల్లించనివారు, ఇళ్లు లేకున్నా నంబరు తీసుకున్న వారిపై కొత్త పురపాలక చట్టం ప్రకారం జరిమానా విధిస్తాం. ఇంటినంబర్ రద్దు చేస్తాం.– సీహెచ్ శ్రీకాంత్, పుర కమిషనర్, పాల్వంచ

# పెరటి కోళ్లకు ఉచిత టీకాలు

ఖమ్మం : పదేళ్ల తర్వాత పెరటి కోళ్లకు టీకాల కార్యక్రమం ప్రారంభమైంది. ఈనెల 20 నుంచి 30 వరకు పది రోజుల పాటు జిల్లాలో టీకాల ప్రక్రియ కొనసాగుతుంది. ఇందు కోసం పశుసంవర్ధకశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ బి.వేణుమనోహర్‌రావు తెలిపారు. టీకాలు తయారు చేసే కేంద్రం ఏపీలోని సామర్లకోటలో ఉంది. తెలంగాణ ప్రభుత్వం అక్కడి నుంచి టీకాలను తెప్పిస్తోంది.కొక్కెర వ్యాధి.. పెరటి కోళ్లకు ప్రధానంగా కొక్కెర వ్యాధి ఆశిస్తుంది. దీంతో పెద్ద మొత్తంలో కోళ్లు చనిపోవటం వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని పేద రైతులు, వ్యవసాయ కూలీలు నష్టపోయే అవకాశం ఉంటుంది. అందువల్ల ప్రభుత్వం ఈ టీకాలను ఉచితంగా అందించాలని నిర్ణయించింది. వీటిని పెరటి కోళ్లకు మాత్రమే ఉచితంగా సరఫరా చేస్తారు. ఫారం కోళ్లకు అందించరు. ఇప్పటి వరకు కొక్కెర వ్యాధి నివారణకు గానూ రైతులు బయటి నుంచి కొనుగోలు చేసిన టీకాలను వేయించారు. జిల్లాలో 2లక్షల వరకు పెరటి కోళ్లు ఉన్నాయి. ప్రతి వంద కోళ్లకు సుమారు రూ.350ల విలువైన టీకాలను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఉచితంగా అందిస్తుంది. ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రాంతంలోని పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని అధికారి కోరారు.

వర్షాలతో తెగుళ్ల భయం ఇటీవల భారీవర్షాలకు వేరుశనగ రైతులు తీవ్రంగా నష్టపోయారు. వేరు, కాయకుళ్లు తెగులు వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. వర్షాలకు తోటల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, తెరపి ఇచ్చాక నివారణ చర్యలు చేపట్టాలని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఐవీఎస్ రెడ్డి సూచించారు.ఆకుమచ్చ తెగులు, కాయకుళ్లు తెగులు నివారణకు కార్బాండిజమ్ 200 గ్రాములు, టెబ్యుకొనజోల్ 80 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. కాయదశకు రాని తోటల్లో ఎకరాకు 200 కిలోల జిప్సం వేస్తే మంచి ఫలితం ఉంటుంది.

# ఇంత అధ్వానమా?

సంగారెడ్డి : వననర్సరీల నిర్వహణ ఇంత అధ్వానంగా జిల్లాలో మరెక్కడాలేదని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఈజీఎస్, గ్రామ పంచాయతీ కార్యదర్శుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని చిల్వర్, మాందాపూర్ గ్రామాల్లో వననర్సరీలను ఆమె పరిశీలించారు. చిల్వర్‌లో మొక్కలు పెరగకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. నర్సరీలు ఇలా ఉంటే హరితహారం కార్యక్రమానికి మొక్కలు ఎలా సిద్ధం చేస్తారని పంచాయతీ కార్యదర్శి లింగప్పపై మండిపడ్డారు. రెండు రోజుల్లో కొత్త మొక్కలు నాటి తనకు ఫొటోలు పంపించాలని ఆదేశించారు. అనంతరం మాందాపూర్ గ్రామంలోని వననర్సరీలో సంగం మొక్కలు కూడా మొలకెత్తక పోవడంతో అధికారులపై మండిపడ్డారు. ఈజీఎస్ అధికారులు, పంచాయతీ



కార్యదర్శుల పర్యవేక్షణ లేకపోవడంతోనే నర్సరీల నిర్వహణ అధ్వానంగా మారిందని, విధుల నిర్వహణపై ఆసక్తి లేకపోతే ఇంటికి వెళ్లిపోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. వననర్సరీల నిర్వహణ లో నిర్లక్ష్యం వహించిన మండలంలోని మాందాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి రేణుకా, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణకు షోకాజ్ జారీ చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో సయ్యద్‌ను ఆదేశించారు.

మహిళా క్లినిక్‌ను సద్వినియోగం చేసుకోవాలి

అల్లాదుర్గంలోని ఆరోగ్య మహిళ క్లినిక్‌ను అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ప్రతీ మహిళా క్లినిక్‌లో పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలని, డ్వాక్రా సంఘాల మహిళలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఏకేపీ ఏపీఎం నాగరాజుకు సూచించారు. ఆమెవెంట ఇన్‌చార్జి ఎంపీడీవో సయ్యద్, ఈజీఎస్ ఏపీవో నవాజ్, వైద్యధికారి అశ్విని ఉన్నారు.

# వసతులు మృగ్యం.. విస్తరణ జాప్యం

వరంగల్ : రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తర్వాత ప్రభుత్వం ఓరుగల్లు అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెబుతోంది. ఇరుగు పొరుగు రాష్ట్రాలతో సహా వేల బస్సులు రాకపోకలు సాగించే హనుమకొండ ప్రయాణ ప్రాంగణం మాత్రం అధ్వానంగానే ఉంటోంది. అనేక ఏళ్లుగా ఈ ప్రయాణ ప్రాంగణాన్ని బాగుచేస్తామని అటు ప్రభుత్వం, ఇటు ఆర్టీసీ ప్రకటించడం, శిలా ఫలకాలు వేసి వదిలేయడం సర్వ సాధారణమైంది. 2015లోనే ప్రయాణ ప్రాంగణాన్ని విస్తరించాలని అప్పటి రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డితో శంకుస్థాపన చేయించారే కానీ పనులు చేపట్టలేదు. ఓరుగుల్లుకు ఆకర్షణీయ పథకం మంజూరయ్యాక ఈ బస్‌స్టేషన్‌ను స్మార్ట్‌సిటీ పథకంలో పీపీటీ విధానంలో తీర్చిదిద్దాలని ఘనమైన అంచనాలు వేశారు కానీ అది నిలిచిపోయింది. తాజాగా కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ బీవోటీ విధానంలో రూ.25 కోట్లతో బస్టాండును తీర్చిదిద్దేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ సారైనా ప్రతిపాదనలకే పరిమితం అవుతుందా? లేక విస్తరణ కార్యరూపం దాలుస్తుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

స్మార్ట్ సిటీలో లేనట్టే

హనుమకొండ బస్‌స్టేషన్‌ను ఎప్పుడో 40 ఏళ్ల క్రితం నిర్మించారు. ఇప్పటి అవసరాలకు తగినట్టుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. ఆ క్రమంలో వరంగల్ ఆకర్షణీయ నగరం పథకంలో ఎంపికయ్యాక హనుమకొండ ప్రయాణ ప్రాంగణాన్ని పీపీటీ విధానంలో అభివృద్ధి చేయాలని ఘనంగా ప్రతిపాదనలు పెట్టారు. ఇప్పుడు బస్‌స్టేషన్‌ను మొత్తం తొలగించి బహుళ అంతస్తుల భవనం నిర్మించి, అత్యాధునిక వసతులతో తీర్చిదిద్దాలని యోచిస్తున్నారు. కేరళలోని తిరువనంతపురం బస్‌స్టేషన్ తరహా డిజైన్ చేయాలనుకుంటున్నారు. వాణిజ్య సముదాయాలు, సినిమా థియేటర్లు నిర్మించి మినీ విమానాశ్రయాన్ని తలపించేలా తీర్చిదిద్ది ఆదాయం వచ్చేలా చేయాలనుకున్నారు. ఇందులో ఒక్క బస్‌స్టేషన్ నిర్మాణానికే రూ.80 కోట్ల వరకు వెచ్చించాలని నిర్ణయించారు. కానీ అడుగులు ముందుకు పడలేదు. అనంతరం ఈ ప్రతిపాదన పూర్తిగా అటకెక్కింది. స్మార్ట్‌సిటీ పథకంలో సాధ్యం కాకపోవడంతో రెండేళ్ల క్రితం రూ.20 కోట్లతో ఈ ప్రాంగణాన్ని ఆధునికీకరించాలని అనుకున్నారు. అది కూడా సాధ్యం కాలేదు.

కేవలం విస్తరణే..గతంలో అనేకమార్లు ప్రతిపాదనలు పెట్టినా ఆచరణ సాధ్యం కాకపోవడంతో తాజాగా ప్రయాణ ప్రాంగణ విస్తరణకు మరో మారు ప్రతిపాదనలు పెట్టేందుకు రంగం సిద్ధమవుతోంది. రూ.25 కోట్లతో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ ఈ పనులను చేపట్టనుంది. బస్ స్టేషన్‌లో ప్రధానంగా డ్రైనేజీ సమస్య ఉన్నట్టు ఆర్టీసీ అధికారులు గుర్తించారు. వర్షాకాలం వచ్చిందంటే చుట్టుపక్కల రహదారులపై నుంచి మురుగు నీరంతా బస్టాండులోకి వచ్చి చేరుతోంది. రోడ్డుకన్నా బస్‌స్టేషన్ ప్రాంగణం దిగువకు ఉండడం ఇందుకు కారణం. ప్రస్తుతం 12 ప్లాట్ఫామ్స్ ఉన్నాయి. రద్దీకి తగ్గట్టు మరో 7 అదనంగా నిర్మించాల్సి ఉంది. వీటితోపాటు సుందరీకరణ, మరుగుదొడ్ల నిర్మాణం, పార్కింగ్ వసతి కల్పన లాంటివి చేపట్టనున్నారు. మొత్తం కూల్చేసి కొత్తది నిర్మించకుండా ప్రస్తుతం కేవలం విస్తరణకే పరిమితం కానుంది.

అనేక ఇబ్బందులుహనుమకొండ ప్రయాణ ప్రాంగణంలో అనేక అసౌకర్యాలు ఉన్నాయి. ఇక్కడి నుంచి ఆంధ్రప్రదేశ్‌తోపాటు, మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలతోపాటు, రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు బస్సు సర్వీసులు రాకపోకలు సాగిస్తున్నాయి. రద్దీ ఎక్కువ కావడంతో ప్రయాణికులు కూర్చునేందుకు కుర్చీలు కూడా సరిపోవడం లేదు. వాహనాలను అడ్డదిడ్డంగా పార్క్ చేస్తున్నారు. మార్గాలనుబట్టి బస్సు దిగిన ప్రయాణికులు బయటకు వెళ్లేందుకు వేర్వేరు దారులు లేవు. ప్రయాణికుల కు సరైన తాగునీటి వసతి లేదు.

డబ్బులు పెట్టి మరీ నీళ్లు కొంటున్నారు. బస్‌స్టేషన్ ప్రాంగణం చెత్తాచెదారంతో నిండి ఉంటోంది. ఈ సారైనా ప్రాంగణ విస్తరణ ప్రతిపాదనలకే పరిమితం కాకుండా ఆచరణలోకి వచ్చేలా చూసే కనీసం ప్రయాణికులకు పాట్లు తప్పుతాయి.

అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దాలిపుల్లూరి సుధాకర్, ఫోరం ఫర్ బెటర్ వరంగల్ వ్యవస్థాపకుడుహనుమకొండ బస్‌స్టేషన్ విస్తరణ చాలా ముఖ్యమైనది. గతంలో స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో చేర్చి మళ్లీ తొలగించడం చాలా బాధాకరం. ఆకర్షణీయ పథకానికి కేంద్రం రూ.198 కోట్లు ఇచ్చింది రాష్ట్రం తన వాటా సరిగా ఇవ్వలేదు. హనుమకొండ ప్రయాణ ప్రాంగణాన్ని డీపీఆర్‌లో చూపినట్టుగా అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దాలని మేం డిమాండు చేస్తున్నాం.



# గ్యాస్ బాంబుల్లా పాల ప్యాకెట్లు!

## 2 రోజులుకే ఆ పాల ప్యాకెట్లు గ్యాస్ బాంబుల్లా పేలుతున్నాయ్: నారా లోకేశ్

అమరావతి: పసి పిల్లలకిచ్చే పాలనూ వదలవా సీఎం జగన్ అంటూ తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ దుయ్యబట్టారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. "రాష్ట్రంలో జె-బ్రాండ్ల మద్యంతో లక్షలాది మహిళల తాళిబొట్లు తెంచుతున్న సైకో జగన్ అవినీతిదాహం పరాకాష్ఠకు చేరింది. పాపపు సొమ్ము కోసం పసిపిల్లలు, బాలింతలకు ఇచ్చే పాలను సైతం కల్తీచేస్తూ కాలకూట విషంగా మార్చారు. అంగన్వాడీ కేంద్రాలకు ఇప్పటివరకు టెట్రా ప్యాకుల్లో సరఫరా చేస్తున్న పాలను.. తాజాగా సైకో జగన్ ముఖారవిందంతో లీటరు పాలిథిన్ పౌచుల్లో సరఫరా చేస్తున్నారు. ఈ నెల 3న ప్యాక్ చేసినట్లుగా చెబుతున్న ఈ పాల ప్యాకెట్లకు డిసెంబర్ 2 వరకు ఎక్స్పైరీ డేట్ ఉన్నా.. సరఫరా చేసిన 2 రోజులుకే గ్యాస్ బాంబుల్లా ఉబ్బి పేలిపోతున్నాయి.

ఇవి చూశాక రక్తం రుచిమరిగిన మృగానికి, అడ్డగోలు సంపాదనకు అలవాటుపడిన జగన్ రెడ్డికి పెద్ద తేడా ఏమీ లేదనిపిస్తోంది" అని నారా లోకేశ్ ధ్వజమెత్తారు.

# గ్రౌండ్ లెవెల్ దాకా...ఫుల్ ఫోకస్ తో జగన్...!



అమరావతి : జగన్ ఫుల్ ఫోకస్ పార్టీ మీద పెట్టేశారు. జస్ట్ ఆరు నెలలు మాత్రమే గడువు ఉందని ఆయన ఇటీవల గడప గడప కార్యక్రమంలో పార్టీ ఎమ్మెల్యేలకు చెప్పేశారు. పార్టీ గ్రాఫ్ బాగుంది. దాన్ని ఇంకా జనంలో ఉంటూ పెంచుకోవాలని ఆయన సూచిస్తున్నారు. ఇక పార్టీని జనంలో దగ్గరగా ఉంచితే అంత మంచి ఫలితాలు వస్తాయని జగన్ కి బాగా తెలుసు. దాంతో పాటు ఇపుడు పార్టీలోని ద్వితీయ శ్రేణి నేతలతో ఆయన మీట్ అవాలని చూస్తున్నారు. అలాగే పార్టీకి గ్రాస్ రూట్ లెవెల్ లో కీలకంగా ఉన్న మండల ప్రెసిడెంట్లు, ఇతర అనుబంధ విభాగాల నాయకులతో నేరుగా ఇంట రాక్ట్ కావాలని జగన్ డిసైడ్ కావడం విశేషం. మండల నాయకులతో పాటు ఎంపీపీలు, ఇతర స్థానిక ప్రజా ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరవుతారని అంటున్నారు. దానికి సంబంధించి ఆయన అక్టోబర్ 9న విజయవాడలో భారీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

ఏపీ వ్యాప్తంగా ఉమ్మడి పదమూడు జిల్లాల నుంచి నాలుగు వేల మందికి తక్కువ కాకుండా మండల వైసీపీ ప్రెసిడెంట్లు ఇతర బాధ్యులతో ముఖ్యమంత్రి ముఖాముఖీ సమావేశం నిర్వహిస్తారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ గత యాభై రెండు నెలలుగా చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వారికి వివరించడంతో పాటు పార్టీ పరంగా చేసిన కార్యక్రమాలను వారి నుంచి అడిగి తెలుసుకుంటారు. అలాగే పార్టీకి జనంలో ఉన్న ఆదరణ గురించి కూడా ఫీడ్ బ్యాక్ సేకరిస్తారు అని అంటున్నారు. ఈ సందర్భంగా వైసీపీ కొత్త నినాదం అయిన వై ఏపీ నీడ్స్ జగన్ అన్న దాన్ని బలంగా జనంలోకి తీసుకెళ్ళడానికి అవసరం అయిన సూచనలు సలహాలతో పాటు దిశానిర్దేశం చేస్తారు అని అంటున్నారు. ఈ కార్యక్రమం తరువాత మరోసారి పూర్తిగా గ్రామీణ ప్రాంతానికి చెందిన నేతలతో సర్పంచులు, ఇతర పంచాయతీ స్థాయి నేతలతో కూడా వైసీపీ అధినాయకత్వం భేటీ ఉంటుంది అని అంటున్నారు అలాగే బూత్ లెవెల్ క్యాడర్ తో కూడా జగన్ ప్రత్యేకంగా సమావేశం అయ్యేందుకు అవసరం అయిన ఏర్పాట్లు కూడా చేస్తారు అని అంటున్నారు.

# నేటి నుంచి వారాహి యాత్ర

## అవనిగడ్డలో బహిరంగ సభతో నాలుగో విడత ప్రారంభం



అమరావతి : జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నిర్వహించే నాలుగో విడత వారాహి యాత్రకు ఆ పార్టీ నాయకులు సర్వ సిద్ధం చేశారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు అవనిగడ్డలోని వీణాదేవి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ క్రీడా ప్రాంగణంలో బహిరంగ సభతో యాత్ర ప్రారంభమవుతుంది. నాల్గవ దశ యాత్ర 5రోజుల పాటు కొనసాగుతుంది. సభ అనంతరం పవన్ మచిలీ పట్నం చేరుకుని 2,3 తేదీల్లో అక్కడే వివిధ కార్యక్రమాల్లో పాల్గొం టారు. 2న కృష్ణా జిల్లా జనసేన నాయకులతో సమావేశమ వుతారు. 3న జనవాణి కార్యక్రమంలో ప్రజా సమస్యలపై ఆర్జీలను స్వీకరిస్తారు. 4న పెడన, 5న కైకలూరు నియోజకవర్గాల్లో పవన్ పర్యటిస్తారు. ఇదిలాఉండగా, ఐదో విడత వారాహి యాత్రకు అవనిగడ్డ నియోజకవర్గానికి పోతిన మహేష్, తాతంశెట్టి నాగేంద్ర, పెడన నియోజకవర్గానికి బోనబోయిన శ్రీనివాస్, అమ్మిశెట్టి వాసు, కైకలూరు నియోజకవర్గానికి ముత్తా శశిధర్, చనమల్ల చంద్రశేఖర్‌లను సమన్వయకర్తలుగా నియమించారు.

# విద్యార్థుల అరెస్ట్.. రణరంగంగా మారిన ధర్నా చౌక్





విజయవాడ: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన 'చలో విజయవాడ' తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విద్యార్థులు రోడ్డెక్కారు. విద్యార్థుల ఆందోళన దృష్ట్యా వివిధ జిల్లాల్లో ఎస్ఎఫ్ఐ నాయకుల ముందస్తు అరెస్టులు చేశారు. హాస్టల్ మెస్ ఛార్జీలు ?3 వేలకు పెంచాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని కోరారు. అలాగే ఖాళీగా ఉన్న అధ్యాపక, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విజయవాడలో రోడ్డెక్కిన విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

# అక్టోబర్ 2న నారా భువనేశ్వరి నిరాహార దీక్ష: అచ్చెన్న



నంద్యాల: తెదేపా అధినేత చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారని తెలిసి చాలా మంది బాధపడ్డారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తెలిపారు. చంద్రబాబు అరెస్టు తట్టుకోలేక దాదాపు 97 మంది చనిపోయినట్లు సమాచారం వచ్చిందన్నారు. నంద్యాలలో ఇవాళ తెదేపా పొలిటికల్ యాక్షన్ కమిటీ సమావేశం జరిగింది. చనిపోయిన 97 మంది పట్ల ఈ సమావేశం సంతాపం వ్యక్తం చేసింది. అనంతరం భవిష్యత్తు కార్యాచరణను అచ్చెన్న ప్రకటించారు. చనిపోయిన వారి కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెబుతామని అచ్చెన్న తెలిపారు. అక్టోబర్ 2 (గాంధీ జయంతి)న నారా భువనేశ్వరి నిరాహార దీక్ష చేస్తారని వెల్లడించారు. అలాగే చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ అక్టోబర్ 2 రాత్రి 7 గంటల నుంచి 7.05 వరకు ప్రతి ఇంట్లో లైట్లన్నీ ఆపేసి ప్రజలు నిరసన తెలపాలని కోరారు. లైట్లు ఆపి వరండాలో కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేయాలన్నారు. మరోవైపు, జనసేన - తెదేపా జాయింట్ యాక్షన్ కమిటీ వేయాలని సమావేశంలో నిర్ణయించినట్లు అచ్చెన్న వెల్లడించారు. త్వరలోనే తెదేపా, జనసేన నుంచి కొంతమందితో కమిటీ వేసి క్షేత్రస్థాయిలో పోరాడతామన్నారు. ఇప్పటికే తాము కలిసి పనిచేస్తున్నామని.. ఆదివారం నుంచి 4 రోజులపాటు మచిలీపట్నం పార్లమెంటు పరిధిలో పవన్ పర్యటిస్తారని తెలిపారు.



# నిజ్జర్ హత్యలో ఆధారాలుంటే.. చూపించండి.. చూస్తాం..!

వాషింగ్టన్: ఖలిస్థానీ సానుభూతిపరుడు హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య విషయంలో కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన ఆరోపణలకు భారత విదేశాంగ మంత్రి జైశంకర్ మరోసారి గట్టిగా బదులిచ్చారు. ఆ ఆరోపణలకు కచ్చితమైన ఆధారాలుంటే చూపించాలన్నారు. ఉగ్రవాదంపై ఉదాసీన వైఖరే ఇక్కడ ప్రధాన సమస్య అని, దాన్ని పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఐరాస సర్వసభ్య సమావేశాల నిమిత్తం అమెరికా వెళ్లిన జైశంకర్.. తాజాగా వాషింగ్టన్‌లో భారత విలేకరులతో మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత్ - కెనడా మధ్య దౌత్య ఉద్రిక్తతలపై ఆయన స్పందించారు. "నిజ్జర్ హత్య కేసులో భారత ఏజెంట్ల హస్తం ఉండొచ్చని కెనడా ఆరోపిస్తోంది. ఆ ఆరోపణలకు సంబంధించి కెనడా వద్ద నిర్దిష్టమైన సమాచారం ఉంటే దాన్ని పరిశీలించేందుకు భారత్ సిద్ధంగా ఉంది. మేమేం తలుపులు మూసుకుని కూర్చోలేదు. కానీ, కెనడా ఆ వివరాలు ఇవ్వాలి కదా..!" అని జైశంకర్ అన్నారు. ఈ అంశంపై ఇరు దేశాలు ప్రభుత్వాలు చర్చలు జరిపి.. విభేదాలను పరిష్కరించుకోవాల్సి అవసరం ఉందన్నారు.

**వారి ఉదాసీన వైఖరే..** "కెనడా ప్రభుత్వంతో భారత్ చాలాకాలంగా సమస్యలు ఎదుర్కొంటోంది. అతివాదం, ఉగ్రవాదంపై వారి ఉదాసీన వైఖరే ఇక్కడ ప్రధాన సమస్య. రాజకీయంగా ఉన్న ఒత్తిళ్లు, ఇతరత్రా కారణాలతో కెనడా అలా వ్యవహరించాల్సి వస్తోంది. భారత్‌లో నేరాలకు పాల్పడిన వ్యక్తులు ఇప్పుడు ఆ దేశంలో ఉన్నారు. వారిని అప్పగించాలని ఎన్నోసార్లు అభ్యర్థించినా కెనడా నిర్లక్ష్యంగా వ్యవహరించింది. దీంతో భారత వ్యతిరేక శక్తులు.. కెనడాలో తమ కార్యకలాపాలకు కొనసాగిస్తున్నాయనేది రహస్యమేమీ కాదు" అని జైశంకర్ మండిపడ్డారు.

**వాక్ స్వేచ్ఛపై మాకు హితబోధలు అక్కర్లేదు..** "కెనడాలో మా దౌత్య కార్యాలయాలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిగాయి. చంపేస్తామని బెదిరింపులు వస్తున్నాయి. దీన్ని సాధారణ పరిస్థితిగా పరిగణించాలా? మరో దేశానికి ఇలాంటి పరిస్థితే ఎదురైతే.. వారు ఎలా స్పందిస్తారు? భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ పేరుతో దౌత్యవవేత్తలపై బెదిరింపులు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు.

వాక్ స్వాతంత్ర్యం గురించి మాకు ఇతరులు నేర్పించాల్సిన అవసరం లేదు. స్వేచ్ఛ పేరుతో హింస జరగడం అంటే.. దాన్ని దుర్వినియోగం చేసినట్లే" అని జైశంకర్ తెలిపారు.



# విశాఖ తీరానికి భారీ పెట్టె

విశాఖ: విశాఖపట్నం సాగర తీరానికి ఓ భారీ పెట్టె కొట్టుకొచ్చింది. దీని బరువు సుమారు వంద టన్నుల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇది పురాతనమైన చెక్క పెట్టె కావడంతో ప్రొక్లెయిన్ సహాయంతో ఒడ్డుకు చేర్చారు. బీచ్‌లో ఉన్న సందర్శకులు ఆ భారీ పెట్టెను చూసేందుకు ఎగబడ్డారు. దీంతో వారిని కట్టడి చేయడానికి పోలీసులు శ్రమించాల్సి వచ్చింది. వైఎంసీఏ బీచ్‌కు కొట్టుకువచ్చిన ఈ భారీ ఆకృతిలోని చెక్క పెట్టె బ్రిటీష్ కాలం నాటిదిగా అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందుకు సంబంధించి ఆర్కియాలజీ విభాగానికి సమాచారం ఇచ్చారు. అయితే, ఆ పెట్టెలో ఏముందనేది ఇప్పుడు ఉత్కంఠగా మారింది. గతంలోనూ విశాఖ తీరానికి కొన్ని వస్తువులు కొట్టుకొచ్చిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు వచ్చిన చెక్క పెట్టెలో ఏముంది అనేది మాత్రం ఆసక్తికరంగా మారింది.



# మానసిక అనారోగ్యం అతిపెద్ద సమస్య..

వాషింగ్టన్ : 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' ఆధ్వర్యంలో అమెరికాలోని వాషింగ్టన్‌లో ప్రపంచ సాంస్కృతిక ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో 'ఆర్ట్ ఆఫ్ లివింగ్', 'ప్రపంచ సాంస్కృతిక ఉత్సవాల' వ్యవస్థాపకులు గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్ ప్రసంగించారు. "తెలివైన వ్యక్తులు తమ సమయాన్ని.. సమన్వయం చేసుకోవడం, పరస్పర సహకారం, మానవ స్ఫూర్తిని పెంపొందించడంలో గడుపుతారు. వారు సైన్స్, సాహిత్యం, హాస్యం, సంగీతం, నృత్యంలో తమ సమయాన్ని వెచ్చిస్తారు. అయితే, పోటీతత్వం అనే భావన లేకుండా, సహకార భావంతో తమ సమయాన్ని గడపడం ఎంతో అవసరం. నేడు మనం చూస్తున్నట్లుగా మానసిక అనారోగ్యం అనేది ఎంతో పెద్ద సమస్య. ఓ వైపు కొంతమంది దూకుడు స్వభావం, హింసాత్మక ప్రవృత్తి కలిగి ఉంటే.. మరోవైపు కొంతమంది నిరాశ, నిస్పృహలకు లోనవుతున్నారు. ఫలితంగా బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. మన మనసులోని ఇలాంటి క్రమరాహిత్యాల నుంచి బయటకు రావడానికి ఉపయోగపడే వేదికే ఈ ఉత్సవం" "జీవితంలో మనకు మూడు విషయాలు ముఖ్యం. అభిరుచి.. ఇది లేకపోతే మనం ఒత్తిడిలోకి వెళ్తాం. నిష్కపటమైన, భావోద్వేగాలను నియంత్రించుకునే మనస్తత్వం ఉండాలి. దీంతోనే మంచి నిద్ర సాధ్యమవుతుంది. కలలు కూడా అవసరం. మనం అందరం కలలు కంటాం. ఇక అందరి మధ్యలో ఉన్నప్పుడు.. నీకు నేనున్నాననే భావన ఇతరులకు కలిగించాలి. మంచితనం మన వారసత్వం. దాన్నెప్పుడూ ఆచరణలో పెట్టాలి. ఈ ప్రపంచమంతా ఒకే కుటుంబమని గుర్తించాలి" అని శ్రీశ్రీ రవిశంకర్ పిలుపునిచ్చారు.



# చంద్రబాబు.. డబ్బు కోసం కక్కుర్తి పడే వ్యక్తి కాదు

తెదేపా అధినేత చంద్రబాబు అరెస్టుపై ప్రముఖ దర్శకుడు రవిబాబు స్పందించారు. జీవితంలో ఎవరికీ ఏదీ శాశ్వతం కాదని.. సినిమా వాళ్లకు గ్లామర్, రాజకీయ నాయకులకు అధికారం అసలు శాశ్వతం కాదన్నారు. అలాగే చంద్రబాబుకు వచ్చిన కష్టాలూ శాశ్వతం కాదని చెప్పారు. 'ఆయన ఏదైనా పనిచేస్తే.. 100 కోణాల్లో ఆలోచించి చేస్తారు. ఆయనకు భూమి మీద ఇవాళే ఆఖరి రోజని తెలిసినా కూడా.. వచ్చే 50 ఏళ్ల అభివృద్ధి గురించి ఆలోచిస్తారు. ఆయన డబ్బు కోసం కక్కుర్తి పడే మనిషి కాదు.

అలాంటి వ్యక్తిని ఆధారాలు లేకుండా జైల్లో పెట్టి ఎందుకు వేధిస్తున్నారో అర్థం కావట్లేదు' అని రవిబాబు అన్నారు.

# తెదేపాతో కలిసి పని చేసే ఆలోచనలో ఉన్నాం: సీపీఐ రామకృష్ణ

విజయవాడ: కేంద్రంలో మోదీ, ఏపీలో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వాలను సాగనంపడమే తమ విధానమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల పొత్తులపై స్పందించారు. తమతో కలిసి వచ్చేవారితో పొత్తులు పెట్టుకుంటామని చెప్పారు. మోదీ, జగన్‌లు.. దేశాన్ని, రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. "జగన్ దోపిడీ, అరాచకాలతో ప్రజలు విసిగిపోయారు. తెలంగాణ కంటే ఏపీ ఎంతో వెనుకబడి పోయింది. రాష్ట్రంలో జగన్ రివర్స్ పాలన చేస్తున్నారు. అన్ని రంగాలను అంధకారంలోకి నెట్టారు.

ఐటీ అనేది ఏపీలో లేకుండా చేశారు. జగన్‌కు కనీసం సిగ్గు కూడా లేదు. పోలవరం, పరిశ్రమలు, ఐటీ గురించి సీఎం మాట్లాడటం లేదు. పోలీసులను అడ్డం పెట్టి అక్రమ కేసులతో ఇబ్బందులు పెడుతున్నారు. ఏపీలో ప్రధాన ప్రతిపక్షం తెదేపా కాబట్టి... వాళ్లతో కలిసి పని చేసే ఆలోచన చేస్తున్నాం. జగన్ అధికారంలోకి రాకుండా ఉండేందుకు మా వంతు కృషి చేస్తాం. మోదీ, అమిత్‌షాల ప్రమేయం లేకుండా చంద్రబాబును జైల్లో పెడతారా? మోదీ జగన్‌లు కలిసి దోచుకున్నారు. ఇప్పుడు కలిసే చంద్రబాబును జైలుకు పంపారు. తెదేపా, జనసేన కూడా ఒకసారి ఆలోచన చేయాలి. వాళ్లు భాజపాతో తెంచుకుని వస్తే మేము స్వాగతిస్తాం. భాజపాతో వాళ్లు వెళ్తే.. జగన్ నెత్తిన పాలు పోసినట్లే. మోదీ సహకారం లేకుండా జగన్ ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేరు. దేశం, రాష్ట్రం బాగు పడాలంటే మోదీ, జగన్‌లను ఓడించాలి" అని రామకృష్ణ వ్యాఖ్యానించారు.

## అశ్లీల సైట్లలో నా ఫోటోలు చూసి షాకయ్యాను!

స్టార్‌గా ఉండడం సులువైనది కాదు.. ఎప్పుడూ సమస్యాత్మక మైనది. సెలబ్రిటీ ఇమేజ్ తో పాటు సమస్యలు కూడా చుట్టుముడతాయి. అలాంటి ఒక పెను సమస్యను తాను ఎదుర్కొన్నానని జాన్వీ కపూర్ చెబుతోంది. అతిలోక సుందరి శ్రీదేవి నటవారసురాలిగా సినీరంగంలోకి ప్రవేశించిన జాన్వీ కపూర్ ఇప్పటికే స్టార్ గా ఓ వెలుగు వెలుగుతోంది. హిందీ పరిశ్రమతో పాటు సౌత్ ఇండస్ట్రీల్లోను సత్తా చాటే ప్రయత్నాల్లో ఉంది. జూనియర్ ఎన్టీఆర్- కొరటాల కాంబినేషన్ మూవీ- దేవరలో జాన్వీ కపూర్ నటిస్తున్న సంగతి తెలిసిందే. అయితే జాన్వీ కపూర్ పేరు అప్పుడప్పుడు రకరకాల కారణాలతో మీడియా హెడ్ లైన్స్ లోకొస్తోంది. ఇంతకుముందు తన ఫోటోలు, తన సోదరి ఫోటోలను అనుమతి లేకుండా తీసారంటూ ఫోటోగ్రాఫర్లపై జాన్వీ ఆరోపించిన సంగతి తెలిసిందే. అంతేకాదు.. తన మార్ఫింగ్ ఫోటోలను అశ్లీల వెబ్ సైట్లలో చూసి షాక్ కి గురయ్యానని జాన్వీ కపూర్ వెల్లడించింది. ఇది ఇప్పుడు కాదు.. ఒకానొకప్పటి అనుభవం అని కూడా తెలిపింది. న్యూస్‌లాండ్రీకి ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో .. నకిలీ మార్ఫ్డ్ ఫోటోల ప్రవాహం నేటి అధునాతన AI (కృత్రిమ మేధస్సు)తో మరింత పెరిగిందని జాన్వీ అన్నారు. ప్రజలు ఈ తారుమారు చేసిన ఫోటోలను చూసి అవి వాస్తవమైనవని ఊహిస్తారు. అది నాకు చాలా ఆందోళన కలిగిస్తోంది.. అని ఆవేదన వ్యక్తం చేసింది.



జాన్వీ పాఠశాలలో చదువుకునే రోజుల్లో తనను "పరాయి"గా చూసారని కూడా తెలిపింది. తాను 4వ తరగతి చదువుతున్నప్పుడు జరిగిన ఒక సంఘటనను గుర్తు చేసుకుంటూ.. యాహూ హోమ్‌పేజీలో తన ఫోటోలు తళుక్కున మెరిసాయని వాటిని చూసినప్పుడు తనకు చాలా అసౌకర్యంగా అనిపించిందని జాన్వీ తెలిపింది. చిత్ర పరిశ్రమలో నటిగా ప్రారంభమవుతానని మీడియా హెడ్ లైన్స్ లో రాసింది. ఆ తర్వాత టీచర్లు కూడా తనతో విభిన్నంగా ప్రవర్తించారని, అది తనకు నచ్చలేదని జాన్వీ పేర్కొంది. స్కూల్ లో ఎదురైన తన అనుభవాలపై జాన్వీ ఆవేదన చెందింది. నిజానికి అక్కడ వారు అర్థం చేసుకున్నారని నేను అనుకోను. ఎవరూ నన్ను ఇష్టపడలేదు. ఏం జరుగుతుందో నాకు అర్థం కాలేదు. నా స్నేహితులు నన్ను వేరే విధంగా చూసారు. నన్ను ఎగతాళి చేశారు... వెబ్ సైట్లలో మార్ఫింగ్ ఫోటోలు చూసి, నేను ఎలాగోలా పేరు తెచ్చుకున్నందుకు నేను ఇక పని చేయనవసరం లేదని ఎగతాళి చేసారు. నాకు అర్థం కాని విచిత్రమైన అవహేళనలు ఎదురయ్యాయి. నేను స్కూల్‌ని ఎప్పుడు వదిలేస్తున్నాను అనుకున్నాను. నేను యాహూలో ఎందుకు ఉన్నాను అని అందరూ నన్ను అడుగుతూ ఉండేవారు. చాలా చిన్న వయస్సు నుండి నా గురించి చాలా చాలా ప్రశ్నలు సమాధానం లేకుండా అలానే ఉన్నాయి. నా గురించి చాలా మంది తీర్పులు చెప్పారు"" అని తన బాధను వెల్లగక్కింది. సెలబ్రిటీని అన్ని కళ్లు చుట్టుముట్టి ఉంటాయి. వాటితో ఇలాంటి సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని జాన్వీ ఎపిసోడ్ ని బట్టి అర్థం చేసుకోవచ్చు. 2018లో జాన్వి "ధడక్" చిత్రంతో నటనను ప్రారంభించింది. ఈ చిత్రంలో ఇషాన్ ఖట్టర్ కథానాయకుడు. కరణ్ జోహార్ నిర్మించారు. మిలీ -గుంజన్ సక్సేనాతో సహా అనేక మహిళా ప్రధాన చిత్రాలలో జాన్వీ కపూర్ నటించింది. చివరిసారిగా వరుణ్ ధావన్‌తో కలిసి బవాల్‌లో కనిపించింది. తర్వాత రాజ్‌కుమార్ రావుతో కలిసి మిస్టర్ అండ్ మిసెస్ మహిలో కనిపించనుంది. తెలుగు పరిశ్రమకు "దేవర" చిత్రంతో పరిచయమవుతోంది.

## చిరుతో స్టెప్పు లేసేందుకు శ్రియ అంత తీసుకుందా..!

ఇష్టం సినిమాతో తెలుగు సినీ రంగంలో అడుగు పెట్టిన శ్రియా శరణ్.. తన అందం అభియనంతో అతి తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్ గా ఎదిగిపోయింది. పెద్ద పెద్ద స్టార్ హీరోల సరసన కూడా నటిస్తూ.. వరుసగా ఛాన్సులు దక్కించుకుంటూనే వస్తోంది. 2001 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు సినిమాల్లో రాణిస్తూనే ఉంది. ఒక్క తెలుగులోనే కాకుండా తమిళ మలయాళ హిందీ కన్నడ చిత్రాల్లోనూ నటించి మెప్పించిందీ బ్యూటీ. సినీ రంగంలో అడుగు పెట్టినప్పుడు ఎలా ఉందో.. ఇప్పుడు కూడా శ్రియ అదే ఫిజిక్ మెయింటెయిన్ చేస్తుంది. ఓ బిడ్డకు జన్మనిచ్చినా తన అందం ఏమాత్రం తగ్గలేదు. సినీ రంగంలో అడుగు పెట్టినప్పుడు ఎలా ఉందో ఇప్పుడు కూడా అలాగే ఉంది. అయితే దాదాపు 20 ఏళ్ల తర్వాత ఈ క్యూట్ బ్యూటీ మెగాస్టార్ చిరంజీవితో నటించబోతోంది. మెగాస్టార్ చిరంజీవి హీరోగా మెహర్ రమేష్ దర్శకత్వం వహించబోతున్న భోళా



శంకర్ సినిమాలో శ్రియా శరణ్ కనిపించబోతుంది. ఆయనతో ఓ స్పెషల్ సాంగ్ లో డ్యాన్స్ చేయబోతుందట. చిరుతో ఆమె స్టెప్పులు వేసేందుకు భారీగానే రెమ్యునరేషన్ కూడా తీసుకుంటుందట. ఒక్క పాటకే 70 లక్షల రూపాయలతో పాటు సెపరేట్ జీఎస్టీ తీసుకుంటుందట. చిరు శ్రియాలతో భోళా శంకర్ సినిమాలో స్పెషల్ సాంగ్ ఉంటుందని తెలిసప్పటి నుంచి మెగా అభిమానులు తెగ ఎగ్జైట్ అవుతున్నారు. అయితే ఈ సినిమాలో చిరంజీవి సరసన తమన్నా నటిస్తున్నారు. స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్.. చిరంజీవికి చెల్లెలిగా కనిపించబోతోంది. అనిల్ సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రంలో రఘుబాబు మురళీ శర్మ రావు రమేష్ వెన్నెల కిషోర్ ప్రగతి.. తదితరులు కీలక పాత్రల్లో నటించబోతున్నారు. అయితే ఈ సినిమా చిరంజీవి నటించబోతున్న 154 వ సినిమా. అలాగే ఈ చిత్రానికి మహతి స్వర సాగర్ సంగీతం అందిస్తున్నారు. అన్నా చెల్లెలి అనుబంధం నేపథ్యంలో ఈ సినిమా కథ సాగనుంది. తమిళంలో వేదాళం సినిమా సూపర్ హిట్టు కొట్టింది. ఈ చిత్రాన్ని ఎప్పటి నుంచో రీమేక్ చేయాలని ప్రయత్నించగా.. ఇప్పటికి కుదిరింది. అది కూడా మెగాస్టార్ చిరంజీవి ఖాతాలో పడింది. ఈ సినిమా షూటింగ్ మధ్యలో నత్త నడకగా సాగింది. దీంతో ఈ సినిమా ఎప్పుడు విడుదల అవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అధికారిక ప్రకటన వచ్చే వరకు ఈ చిత్రం ఎప్పుడు రిలీజ్ అవుతుందో ఎవరికీ తెలియదు.




## సైంధవ్.. అంత బడ్జెట్ అంటే రిస్కే..



విక్టరీ వెంకటేష్ హీరోగా శైలేష్ కొలను దర్శకత్వంలో తెరకెక్కుతోన్న పాన్ ఇండియా మూవీ సైంధవ్. భారీ బడ్జెట్ తో కంప్లీట్ యాక్షన్ బ్యాక్ డ్రాప్ కథతో ఈ చిత్రం సిద్ధమవుతోంది. శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్ గా నటిస్తోంది. రుహని శర్మ, ఆండ్రియా ఫిమేల్ లీడ్ రోల్ లో నటిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ యాక్టర్ నవాజుద్దీన్ ఈ చిత్రంలో విలన్ గా కనిపించబోతున్నాడు. తమిళ్ స్టార్ ఆర్య కూడా ఓ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా ఫస్ట్ లుక్, గ్లింప్స్ తో ఆకట్టుకుంది. వెంకటేష్ కెరియర్ లోనే హైయెస్ట్ బడ్జెట్ తో ఈ చిత్రాన్ని నిహారిక ఎంటర్టైన్మెంట్స్ నిర్మిస్తోంది. హిట్ సిరీస్ లో రెండు సక్సెస్ లతో జోరుమీదున్న శైలేష్ కొలను పాన్ ఇండియా రేంజ్ లో 70 కోట్ల బడ్జెట్ తో హై వోల్టేజ్ యాక్షన్ ని సైంధవ్ తో హ్యాండిల్ చేస్తున్నాడు. విక్టరీ వెంకటేష్ కూడా ఈ చిత్రంతో తన మార్కెట్ రేంజ్ పెంచుకోవాలని అనుకుంటున్నారు. ఈ సినిమాని క్రిస్మస్ కి ప్రేక్షకుల ముందుకి తీసుకురావాలని అనుకున్నారు. అయితే అదే సమయంలో డార్లింగ్ ప్రభాస్ సలార్ మూవీ రిలీజ్ కానుంది. అలాగే షారుఖ్ ఖాన్ డుంకీ చిత్రం కూడా ప్రేక్షకుల ముందుకి రాబోతోంది. ఈ రెండు సినిమాలతో పోటీ పడటం అంటే రిస్క్ అనే చెప్పాలి. అలాగే బడ్జెట్ పరంగా కూడా సైంధవ్ కి చాలా ఎక్కువ మొత్తంలో ఖర్చు చేస్తున్నారు. వెంకటేష్ మీద ఈ బడ్జెట్ అంటే చాలా పెద్ద రిస్క్ చేస్తున్నట్లే. ఈ స్థాయిలో బడ్జెట్ పెట్టి పాన్ ఇండియా లెవల్ లో చేస్తున్నప్పుడు కాస్తా సేఫ్ జోన్ లో రిలీజ్ చేస్తే ఉత్తమం అని నిర్మాత వెంకట్ బోయనపల్లి, దర్శకుడు శైలేష్ కొలను ఆలోచించారంట. అందుకే డిసెంబర్ లో అనుకున్న సైంధవ్ సినిమాని రిలీజ్ జనవరిలో సంక్రాంతికి పొడిగించాలని ప్లాన్ చేస్తున్నారు. అయితే సంక్రాంతి బరిలో సూపర్ స్టార్ మహేష్ బాబు గుంటూరు కారం రిలీజ్ అవుతోంది. అలాగే హనుమాన్, రవితేజ ఈగల్, నా సామి రంగా చిత్రాలు కూడా రిలీజ్ కానున్నాయి. వీటిలో గుంటూరు కారం, ఈగల్ డేట్స్ కన్ఫర్మ్ అయ్యాయి. హనుమాన్ కూడా రిలీజ్ కన్ఫర్మ్ అయిపోయింది. అలాగే నా సామి రంగా సంక్రాంతి అని చెప్పి స్పీడ్ గా షూటింగ్ స్టార్ట్ చేశారు. అయితే హనుమాన్ లేదా ఈగల్ తప్పుకుంటే సైంధవ్ సంక్రాంతి డేట్ ఫిక్స్ చేయాలని ప్లాన్ చేస్తున్నరు. అయితే ఈ రెండు డేట్స్ లో రిలీజ్ ఎప్పుడైనా గట్టి పోటీ ఖాయం. ఈ విషయంలో దర్శక, నిర్మాతలు రిస్క్ చేస్తారా లేదా వెనక్కి తగ్గుతారా అనేది చూడాలి.

## 50లో పరువాల విందు ఏంటీ వింత?





వయసు 50కి చేరువలో ఉన్నా మనసు పదహారు(16) దాటనంటే దానికి అడ్డుకట్ట వేసేదెవరు? అయినా మనసుండాలే కానీ వయసుతో పనేం ఉంది? ఇదిగో ఇక్కడ 50కి చేరువలో ఉన్నా కానీ అసలు వయసు ఒక నంబర్ మాత్రమేనని నిరూపిస్తూ సీనియర్ హీరోయిన్ శిల్పాశెట్టి షాక్ ల మీద షాక్ లిస్తోంది. ఆమె తిరిగి యవ్వనంలోకి రివర్స్ గేర్ లో వెళుతోంది. వృద్ధాప్యం ఛాయలు ఏ మూలా దరిచేరనివ్వకుండా మెయింటెయిన్ చేస్తోంది. చినిగిన జీన్సులు పొట్టి నిక్కర్లు బికినీలు స్విమ్ సూట్లు అసలు చెలరేగిపోయేందుకు హద్దే లేదని నిరూపిస్తూ వామ్మోవ్ ఆవిడే ఈవిడా? అని కుర్రకారు నోరెళ్లబెట్టేలా చేస్తోంది. మంచు కాంపౌండ్ హీరోయిన్ గా పేరు బడిన శిల్పాశెట్టి ఇప్పటికీ బాలీవుడ్ లో కలల రాణిగా వెలిగిపోతోందంటే అతిశయోక్తి కాదు. శిల్పా శెట్టి ఇటీవల తన సోదరి షమిత శెట్టి పుట్టినరోజు వేడుకలకు పొట్టినిక్కరుతో హాజరవ్వగా కళ్లన్నీ అటే తిరిగిపోయాయి. ఈ ఈవెంట్లో శిల్పాజీ కేంద్రక ఆకర్షణగా నిలిచింది. మోహబ్బతేన్ రోజులు గుర్తుకొచ్చాయంటూ యూత్ కామెంట్లు చేసారు. శిల్పా ఏ వేదిక వద్దకు వచ్చినా ఫోటోగ్రాఫర్ లు గుంపుగా మీద పడుతున్నారు. ఒకరితో ఒకరు పోటీపడుతూ ఫోటోషూట్లు చేస్తున్నారు. తాజాగా శిల్పాజీ మీడియా కెమెరాల ముందు క్యాట్ వాక్ చేస్తున్న వీడియో ఎగిరి గంతేసిన వైనం హాట్ టాపిక్ గా మారాయి. పాక్షికంగా ఎద అందాల ఎలివేషన్ తో సరికొత్త డిజైనర్ డ్రెస్ లో శిల్పాజీ ప్రత్యక్షమైన తీరు అలా కెమెరాలకు ఫోజులిచ్చిన వైనం ఇప్పుడు యూత్ లో హాట్ టాపిక్ గా మారింది. ప్రస్తుతం ఈ స్పెషల్ వీడియో ఇంటర్నెట్ లో సునామీ సృష్టిస్తోంది. వీడియో షేర్ చేయగానే చాలా మంది నెటిజన్లు నటిని తన ఫిట్ నెస్.. అందమైన లుక్ ని ప్రశంసించారు ఆమె వయసు 47 కానీ తను పిల్లలకు తల్లి అంటే నమ్మడం చాలా కష్టం అని వ్యాఖ్యానిస్తున్నారు. శిల్పాజీని చూసి వృద్ధాప్యం వెనకడుగువేస్తోంది! అని ఒక వినియోగదారు రాశారు. మరొక వినియోగదారు ఇలా వ్రాశాడు "శిల్పా జి ఆజ్ భి 16 టీన్ కి ఎల్జిటి హెచ్ (శిల్పా ఇప్పటికీ 16 ఏళ్ల లాగా కనిపిస్తోంది) అని ప్రశంసించారు. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. శిల్పా శెట్టి 2021 కామెడీ హంగామా 2 తో బాలీవుడ్ లో రీఎంట్రీ ఇచ్చారు. అయినప్పటికీ ఈ చిత్రం తో ఆశించిన గుర్తింపు దక్కలేదు. శిల్పా తరువాత రోహిత్ శెట్టి దర్శకత్వం వహించిన ఇండియన్ పోలీస్ బలగాలలో కనిపించనుంది. తదుపరి వెబ్ సిరీస్ OTT లో విడుదల కానుంది.

## హైట్ అందాలతో కవ్విస్తున్న రాయ్


తెలుగు ప్రేక్షకులకు 2005 లో కాంచన మాల కేబుల్ టీవీ సినిమా తో పరిచయం అయిన ముద్దుగుమ్మ లక్ష్మీ రాయ్. ఆ తర్వాత కొన్నాళ్లకు తన పేరును రాయ్ లక్ష్మి గా మార్చుకుని ఇండస్ట్రీలో తన అదృష్టం ను పరీక్షించుకుంది. స్టార్ హీరోలతో సినిమాలు లేవు.. భారీ బ్లాక్ బస్టర్ విజయాలు పెద్దగా లేవు. అయినా కూడా దాదాపు రెండు దశాబ్దాలుగా కెరీర్ ను కొనసాగిస్తోంది. ఇన్నాళ్ల ఈ అమ్మడి కెరీర్ జోరుకు కారణం అందాల ఆరబోత అనడంలో సందేహం లేదు. చేసిన ప్రతి సినిమా లో కూడా కెరీర్ ఆరంభం నుంచి కూడా అందాల ఆరబోత చేయడం విధిగా పెట్టుకున్నట్లుగా స్కిన్ షో చేసింది.



ఈ మధ్య కాలంలో సోషల్ మీడియాలో రాయ్ లక్ష్మి జోరు గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆమె షేర్ చేసే ప్రతి ఫోటో షూట్ కూడా అందరి దృష్టిని ఆకర్షిస్తూ వస్తుంది. హీరోయిన్ గానే కాకుండా ఫోటో షూట్స్ తో ఈ అమ్మడు దక్కించుకున్న గుర్తింపు, పాపులారిటీ ఏకంగా బాలీవుడ్ ఆఫర్లను తెచ్చి పెట్టాయి అనడంలో సందేహం లేదు. బాలీవుడ్ లో ఈ అమ్మడికి మంచి ఆఫర్లే వచ్చాయి. అయితే అదృష్టం కలిసి రాకపోవడంతో సక్సెస్ లు దక్కలేదు. తాజాగా మరోసారి తన బిగుతు అందాల ఆరబోత ఫోటో షూట్ ను షేర్ చేసింది. ఎద అందాలను ఎక్స్ పోజ్ చేస్తూ బ్లాక్ డ్రెస్ లో రాయ్ లక్ష్మి షేర్ చేసిన ఈ ఫోటోలు నెటిజన్స్ ని చూపు తిప్పుకోనివ్వడం లేదు. ఈ రేంజ్ లో అందాల ఆరబోత చేయడం వల్లే నాలుగు పదుల వయసుకు వచ్చినా కూడా సినిమాల్లో ఆఫర్లు వస్తూనే ఉన్నాయి. ముందు ముందు కూడా రాయ్ లక్ష్మికి మంచి ఆఫర్లు దక్కడం ఖాయం.

## చీర కట్టులో అనసూయ మేడం జోరు మామూలుగా లేదుగా..!

జబర్దస్త్ మాజీ యాంకర్ అనసూయ మరోసారి తన ఫోటోలతో వార్తల్లో నిలిచింది. ఇద్దరు పిల్లల తల్లి అయినా కూడా హీరోయిన్స్ స్థాయిలో తన ఫోటోలతో జనాల అటెన్షన్ ను దక్కించుకోగల సత్తా ఉన్న ముద్దుగుమ్మ అనసూయ అనడంలో సందేహం లేదు. ఈ ఫోటోలతో మరోసారి అనసూయ ఆ విషయాన్ని నిరూపించుకుంది. ఈమధ్య కాలంలో జబర్దస్త్ కార్యక్రమానికి దూరం అయిన అనసూయ వరుసగా సినిమాల్లో నటిస్తున్న విషయం తెల్సిందే. హీరోయిన్ గా కాకుండా పాత్రకు ప్రాముఖ్యత ఉన్న సినిమాల్లో



నటించడంతో పాటు ప్రత్యేక పాటల్లో మరియు పాత్రల్లో నటించడం ద్వారా అనసూయ మరింత మందికి చేరువ అవుతుంది. అనసూయ ప్రస్తుతం బుల్లి తెరకు దూరంగా ఉంటుంది. ఒక వైపు సినిమాల్లో నటిస్తూనే మరో వైపు బుల్లి తెరపై కూడా నటించాలని అభిమానులు కోరుకుంటున్నారు. సోషల్ మీడియాలో రెగ్యులర్ గా అందాల ఆరబోత చేసే అనసూయ మరోసారి తన చీర కట్టు తో కన్నులు తిప్పుకోకుండా చేసింది. చీర కట్టు లో క్లీవేజ్ షో చేసిన ఈ అమ్మడి యొక్క అందాల ఆరబోతకు ప్రతి ఒక్కరు ఫిదా అవుతున్నారు. ఇంత అందంగా కొన్ని సార్లు హీరోయిన్స్ కూడా కనిపించరు మేడం.. మీరు ఎందుకు స్టార్ హీరోలకు జోడీగా హీరోయిన్ గా నటించడం లేదు అంటూ కొందరు ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తూ ఉంటే మరో పదేళ్లు అయినా మీరు ఇంతే అందంగా ఉండాలని కోరుకుంటున్నాం అంటూ కామెంట్స్ చేశారు.




## ఎన్టీఆర్ శిష్యుడిగా కేసీఆర్ తెలంగాణ అస్తిత్వాన్ని చాటారు: కేటీఆర్

ఖమ్మం: ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారికి ఎన్టీఆర్ ఆరాధ్య దైవమని తెలంగాణ మంత్రి కేటీఆర్ కొనియాడారు. ఖమ్మంలోని లకారం ట్యాంక్ బండ్‌పై రూ. 1.37 కోట్లతో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ పార్క్ సహా విగ్రహాన్ని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌తో కలిసి కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. "ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ ఎంతో ఆప్తుడు విశ్వ విఖ్యాత నందమూరి తారక రామారావు. ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసిన మహా నాయకుడు ఎన్టీఆర్. రాముడు ఎలా ఉంటాడో తెలియదు.. కృష్ణుడు ఎలా ఉంటాడో తెలియదు.. మాకు రాముడైనా, కృష్ణుడైనా ఆయనే. భారత దేశంలో తెలుగు వారంటూ ఉన్నారని గుర్తించేలా చేసింది ఎన్టీఆరే. చరిత్రలో మహనీయుల స్థానం ఎప్పటికీ చిరస్మరణీయంగా ఉంటుంది. ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించే అవకాశం రావడం నా అదృష్టం. నాకు తారక రామారావు పేరు ఉండటం చాలా సంతోషంగా ఉంది. తారక రామారావు పేరులోనే పవర్ ఉంది. ఎన్టీఆర్ శిష్యుడిగా కేసీఆర్ తెలంగాణ అస్తిత్వాన్ని దేశవ్యాప్తంగా చాటి చెప్పారు. దక్షిణ భారత దేశంలో అన్న ఎన్టీఆర్ సహా ఇప్పటివరకూ హ్యాట్రిక్ ఎవరూ కొట్టలేదు. అది సీఎం కేసీఆర్‌కు త్వరలో సాధ్యమవుతుంది" అని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

## నేను పురుషులకంటే మెరుగ్గానే పనిచేస్తా: గవర్నర్ సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్: తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తనపై పువ్వులు వేసే వారు ఉన్నారని, రాళ్లు వేసే వారు కూడా ఉన్నారని అననారు. అందరూ అందరికీ నచ్చాలని లేదని తెలిపారు. అయితే మంచి పనులు చేయడానికి అధికారం ఉండాలన్న గవర్నర్.. ఎన్ని అవమానాలు ఎదురైనా వెనక్కి తగ్గనని స్పష్టం చేశారు. నాపై రాళ్లు విసిరితే ఇల్లు కట్టుకుంటా.. పిన్స్ వేస్తే ఆ పిన్స్ గుచ్చుకొని వచ్చే రక్తంతో నా చరిత్ర పుస్తకం రాస్తానంటూ తమిళిసై వ్యాఖ్యానించారు. ఈ మేరకు శనివారం గవర్నర్ మాట్లాడుతూ.. లోక్‌సభ, శాసనసభలో 33% మహిళా రిజర్వేషన్ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలిపారు. గత 27 ఏళ్లుగా ఈ బిల్లు గురించి మాట్లాడుతున్నారు కానీ అమలు కాలేదని పేర్కొన్నారు. ఓ మహిళా రాష్ట్రపతి ఈ బిల్లుపై సంతకం చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఒక కలతోనే రాజకీయాల్లోకి వస్తారని, అవకాశం వచ్చినప్పుడు పురుషులతో పోలిస్తే 20 రేట్లు ఎక్కువగా పని చేస్తే కానీ మహిళకు గుర్తింపు లభించదని తమిళిసై అన్నారు. ఒకప్పుడు తాను బీజేపీ నేతనని, ఇప్పుడు గవర్నర్ అని పేర్కొన్నారు. అప్పట్లో బీజేపీలో 33 శాతం రిజర్వేషన్‌ను మహిళలకు కల్పిస్తూ పార్టీ నిర్ణయించిందని, ఫలితంగా ఎంతోమంది మహిళలు పార్టీలో చేరారని ప్రస్తావించారు. రాజకీయాలపై మక్కువతోనే తను ఎంతగానో ఇష్టమైన వైద్యవృత్తిని కూడా పక్కన పెట్టాల్సి వచ్చిందన్నారు గవర్నర్. 'రాజకీయాల్లో పురుషాధిక్యత ఎక్కువ. భారత్‌లో 15 లక్షల పంచాయతీలకు ప్రెసిడెంట్‌లుగా మహిళలు ఉన్నారు. నేను పురుషులకంటే మెరుగ్గానే పని చేస్తున్నాను. ఇకపై రాజకీయాల్లో మహిళా పవర్ కనిపిస్తుంది. నేను గవర్నర్‌గా వచ్చినప్పుడు ఒక మహిళా మంత్రి కూడా లేరు. గవర్నర్‌గా పదవి చేపట్టిన రోజు సాయంత్రం ఇద్దరు మహిళా మంత్రులు ప్రమాణస్వీకారం చేశారు. ప్రోటోకాల్ ఇచ్చినా ఇవ్వకున్నా పనిచేసుకుంటూ పోతానంటూ' తమిళిసై పేర్కొన్నారు.

## ప్రధాని ఏ మొహం పెట్టుకుని పాలమూరు వస్తున్నారు?

మహబూబ్‌నగర్: జిల్లాలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పర్యటనపై మంత్రి శ్రీనివాస్ గౌడ్ స్పందించారు. ఈ సందర్భంగా ప్రధానిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. రేపు (ఆదివారం) పాలమూరుకు వస్తున్న ప్రధాని ఏ మొఖం పెట్టుకుని వస్తున్నారని ప్రశ్నించారు. పాలమూరుకు లక్ష లేదా 50 వేల కోట్ల ప్యాకేజి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మోడీ గతంలో ఏ వేదిక మీద పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా హామీ ఇచ్చి మరిచారో అదే వేదిక మీదకు ఏం ఉద్ధరిద్దామని వస్తున్నారని నిలదీశారు. తెలంగాణ డబ్బులతో ప్రాజెక్టులు కట్టుకుంటాము కాని కృష్ణానదిలో నీటివాట తేల్చాలన్నారు. తెలంగాణను అవమానించిన మోడీకి ఇక్కడేమి పని అని ప్రశ్నించారు. మోడీ పాలమూరుకు ద్రోహం చేశారని మండిపడ్డారు. ఈ ప్రాంత ప్రజలకు క్షమాపణ



చెప్పిన తర్వాతే అడుగుపెట్టాలని డిమాండ్ చేశారు. అడ్డదారుల్లో తెలంగాణలో పాగావేయాలని బీజేపీ చూస్తోందని అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అభివృద్ధి చెందుతున్న తెలంగాణను బీజేపీ నాశనం చేయాలని చూస్తోందని మంత్రి శ్రీనివాస్ గౌడ్ వ్యాఖ్యలు చేశారు.

## 3న రాష్ట్రానికి కేంద్ర ఎన్నికల బృందం




హైదరాబాద్ : కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ నేతృత్వంలోని అధికారుల బృందం, అక్టోబరు 3 నుంచి 5 వరకు రాష్ట్రంలో పర్యటించనుంది. ఈ నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లు సహా పలు అంశాలపై చర్చించేందుకు సీఎస్ శాంతికుమారి సచివాలయంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఎన్నికలకు సంబంధించి పూర్తి వివరాలతో అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు, కలెక్టర్లు, ఎస్పీలు/సీపీలతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ అధికారులతో కేంద్ర ఎన్నికల అధికారులు సమావేశాలు నిర్వహిస్తారని ఆమె తెలిపారు. ప్రధాని మోదీ అక్టోబరు 3న నిజామాబాద్‌లో బహిరంగ సభలో పాల్గొంటారని, అందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

### బీజేపీకి సోమారపు రాజీనామా!

పెద్దపల్లి: మాజీ ఎమ్మెల్యే, బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు సోమారపు సత్యనారాయణ ఆ పార్టీకి రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు సమాచారం.

రాష్ట్రంలో బీజేపీకి రోజురోజుకూ తగ్గుతున్న ఆదరణ, కార్యకర్తల ఒత్తిడి మేరకు పార్టీని వీడేందుకు సిద్ధమయ్యారు. కాంగ్రెస్ టికెట్ ఇస్తే.. ఆ పార్టీ తరపున పోటీకి సోమారపు ఆసక్తి చూపుతుండగా, కార్యకర్తలు, అనుచరులు ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ సింహం గుర్తుపై పోటీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. మరోవైపు.. నామినేడ్ పోస్టు ఇస్తామని బీఆర్ఎస్ నుంచి ఆఫర్ వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో సోమా రపు ఏ పార్టీలో చేరతారనేది చర్చనీయాంశంగా మారింది.



ఇదే విషయమై సోమా రపు సత్యనారాయణను ఫోన్‌లో సంప్రదించగా.. ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేద న్నారు.

## భద్రాచలంలో దారుణం.. నాలాలో పడి మహిళా హెడ్ కానిస్టేబుల్ మృతి



భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలంలో నాలాలో పడి మహిళా హెడ్ కానిస్టేబుల్ ప్రాణాలు కోల్పోయారు. భద్రాద్రి రామయ్య ఆలయం ఎదురుగా ఉన్న అన్నదానం సత్రం వద్ద మురుగు కాలువలో పడి హెడ్ కానిస్టేబుల్ శ్రీదేవి మృతి చెందారు. కొత్తగూడెంలో విధులు నిర్వహిస్తోన్న శ్రీదేవి డ్యూటీలో భాగంగా భద్రాచలం వచ్చారు. విధులు పూర్తి అయిన తర్వాత భద్రాద్రి రామయ్యను దర్శించుకొని అన్నదాన సత్రంలో భోజనం చేసేందుకు వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు అన్నదాన సత్రం ఎదురుగా ఉన్న నాలాలో పడిపోయారు. శనివారం భద్రాచలంలో వర్షం కురవడంతో నాలాలో భారీగా వరద నీరు చేరింది. ప్రమాద సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే గాలింపు చర్యలు చేపట్టారు. ఘటన జరిగిన ప్రాంతం నుంచి కొద్దిదూరంలో ఉన్న కాలువలో ఆమె మృతదేహాన్ని గుర్తించారు.




## చంద్రబాబుకు మద్దతుగా ఐటీ ఉద్యోగుల స్పెషల్ ప్రోమో... సోషల్ మీడియాలో విస్తృతంగా షేర్

హైదరాబాద్: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్ట్ అయిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు ఐటీ ఉద్యోగులు మద్దతుగా నిలిచారు. చంద్రబాబు అరెస్ట్ అక్రమమని.. వెంటనే ఆయనను విడుదల చేయాలంటూ హైదరాబాద్‌లోని ఐటీ ఉద్యోగులు డిమాండ్ చేస్తూ నిరసనకు దిగారు. చంద్రబాబును సపోర్ట్ చేస్తూ ర్యాలీలు, ఆందోళనలు కూడా చేపట్టారు. ఇప్పుడు తాజాగా.. చంద్రబాబుకు మద్దతుగా హైదరాబాద్ ఐటీ ఉద్యోగులు స్పెషల్ ప్రోమోను రూపొందించారు. హైదరాబాద్‌తో పాటు తెలుగు రాష్ట్రాలకు బాబు చేసిన అభివృద్ధిని వివరిస్తూ వీడియో విడుదల చేశారు. సోషల్ మీడియాలో చంద్రబాబు స్పెషల్ ప్రోమోను ఐటీ ఉద్యోగులు విస్తృతంగా షేర్ చేస్తున్నారు. బాబు చేసిన అభివృద్ధిని గతంలో మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను గుర్తు చేస్తూ వీడియోను రూపొందించారు.

## పాత అలవాట్లు ఎక్కడికిపోతాయ్.. అందుకే 'స్కాంగ్రెస్' అంటారు..



హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్‌పై మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ... "కర్ణాటకలో కొత్తగా ఎన్నికైన కాంగ్రెస్ ప్రభుత్వం రాబోయే తెలంగాణా అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ కాంగ్రెస్‌కు నిధులు ఇవ్వడానికి బెంగళూరు బిల్డర్లకు చదరపు అడుగుకి 500 రూపాయల "రాజకీయ ఎన్నికల పన్ను" విధించడం ప్రారంభించింది.

పాత అలవాట్లు ఎక్కడికి పోతాయ్? ఘనత వహించిన గ్రాండ్ ఓల్డ్ పార్టీ చేసిన కుంభకోణాలు అన్నీ ఇన్ని కాదు. అందుకే దీనికి "స్కాంగ్రెస్" అని పేరు పెట్టారు. ఎంత డబ్బు ముట్టజెప్పినా తెలంగాణ ప్రజలను స్కాంగ్రెస్ పార్టీ మోసం చేయలేదు. తెలంగాణ నుండి స్కాంగ్రెస్ తరిమికొడదాం!" అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

## ఎలక్టోరల్ బాండ్లు.. చట్టపరమైన లంచం: చిదంబరం

న్యూఢిల్లీ: ఎలక్టోరల్ బాండ్లను జారీ చేయడం చట్టపరమైన లంచం అని కాంగ్రెస్ నేత చిదరంబరం ఆరోపించారు. అక్టోబర్ 4వ తేదీ నుంచి పది రోజుల పాటు ఎలక్టోరల్ బాండ్లను ఓపెన్ చేస్తున్నట్లు ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నేత చిదంబరం ఆ ఆరోపణలు చేశారు. బీజేపీ సర్కార్‌కు ఇది బంగారు పంటగా మారుతుందని ఆయన విమర్శించారు. 28వ సారి ఎలక్టోరల్ బాండ్లను అనుమతి ఇస్తూ కేంద్ర సర్కారు శుక్రవారం ప్రకటన జారీ చేసింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన అన్ని బ్రాంచిలలో అక్టోబర్ 4 నుంచి 13న వరకు 28వ విడత ఎలక్టోరల్ బాండ్లను విక్రయించనున్నట్టు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, తెలంగాణ, మిజోరం రాష్ట్రాల్లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రం ఎలక్టోరల్ బాండ్లను విక్రయించనున్నట్లు తెలిపింది. గత రికార్డులను దృష్టిలో పెట్టుకుంటే, ఆ బాండ్లలో 90 శాతం వరకు బీజేపీకి వెళ్లనున్నట్లు కాంగ్రెస్ నేత చిదంబరం ఆరోపించారు. ఆశ్రిత పెట్టుబడిదారులు తమ చెక్ బుక్‌లను ఓపెన్ చేసి ఢిల్లీలో ఉన్న తమ



మాస్టర్ కోసం సంతకాలు చేస్తారని పేర్కొన్నారు. ఎలక్టోరల్ బాండ్లను లీగల్ బ్రైబరీగా ఆయన విమర్శించారు.

పొలిటికల్ ఫండింగ్‌లో పారదర్శకత కోసం నేరుగా నగదు విరాళాలు కాకుండా దానికి ప్రత్యామ్నాయంగా ఎలక్టోరల్ బాండ్లను ప్రవేశపెట్టారు. మార్చి 2018లో తొలిసారి ఎలక్టోరల్ బాండ్లను విక్రయించడం మొదలుపెట్టారు. కేవలం స్టేట్ బ్యాంక్ ఇండియాలో మాత్రమే ఆ బాండ్లను విక్రయిస్తారు.




ఆరోగ్యమే మహాభాగ్యం, ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం వ్యాయామం, యోగా చేయాలని మంత్రి మల్లారెడ్డి ప్రజలకు సూచించారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా హైదరాబాద్ కూకట్ పల్లిలో మల్లారెడ్డి నారాయణ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన 5కే వాకథాన్ నిర్వహించారు. దీనికి మంత్రి మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్టేజ్ పై, వైద్యులు, యువతతో కలిసి డ్యాన్స్ చేస్తూ వారిలో ఉత్సాహం నింపారు. యువత డ్రగ్స్, మత్తు పదార్థాలకు బానిస కాకూడదు అంటూ హితవు పలికారు.

## 6 కాదు.. 60 గ్యారంటీలిచ్చినా కాంగ్రెస్‌ను నమ్మరు

హైదరాబాద్: తెలంగాణకు కాంగ్రెస్ మరోసారి కుచ్చు టోపీ పెడుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఆరు కాదు.. 60 గ్యారంటీలిచ్చిన కాంగ్రెస్‌ను తెలంగాణ ప్రజలు నమ్మరన్నారు. దేశాన్ని 60 ఏళ్ళు పాలించిన కాంగ్రెస్ చరిత్ర అందరికీ తెలుసన్నారు. పదేళ్ళుగా అధికారానికి దూరంగా.. కాంగ్రెస్ నేతలు ఆకలితో ఉన్నారని అన్నారు. తన పర్యటనలో ప్రధాని మోదీ తెలంగాణకు కానుకలు ఇవ్వబోతున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో స్వయంగా మంత్రులే ఓడిపోబోతున్నారని.. అందుకే సీఎం కేసీఆర్ తొండి ఆట ఆడుతున్నారని వ్యాఖ్యలు చేశారు.

ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణకు వస్తుంటే కేసీఆర్ కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రధాని మోదీ టూర్‌పై కేసీఆర్ ఇంట్లో కూర్చుండి కుట్రలు చేస్తున్నారన్నారు. తొమ్మిదేళ్లలో తెలంగాణ కోసం కేంద్రం 9 లక్షల రూపాయలు ఖర్చు చేసిందని తెలిపారు. కేసీఆర్ 90 రోజులే అధికారంలో ఉంటారని.. శాశ్వతంగా ఫార్మ్ హౌస్‌లో ఉండబోతున్నారన్నారు. కేసీఆర్ కో హటావో.. తెలంగాణకో బచావో ఇది రాష్ట్ర ప్రజల నినాదామని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే గెలిచిన వాళ్లు బీఆర్ఎస్‌లో చేరుతారని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.



## చంద్రబాబు అరెస్టుపై స్పందించిన మంత్రి హరీశ్‌రావు



సిద్ధిపేట: తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టుపై తెలంగాణ మంత్రి హరీశ్‌రావు స్పందించారు. శనివారం సిద్దిసేటలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఈ వయసులో చంద్రబాబును అరెస్టు చేయడం దుదృష్టకరమన్నారు. ఆయన్ను అరెస్టు చేయడం మంచిది కాదని పేర్కొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు అరెస్టుపై పార్టీలకతీతంగా నేతలు స్పందిస్తున్న విషయం తెలిసిందే. తెలుగు రాష్ట్రాలతో పాటు విదేశాల్లో కూడా చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఆందోళనలు కొనసాగుతున్నాయి.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com